# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 20 పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం - 09 - జనవరి- 2025

## యువతకు జాబ్ ఆఫర్స్..

జనవరి 7 నుంచి వీటికి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.



ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు గుడ్ న్యూస్ వచ్చేసింది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల అగ్నిపథ్ ఎయిర్ అగ్నివీర్ ఇంటెక్ 02/2025 బ్యాచ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ ఇన్‌టేక్ బ్యాచ్ 2025లో ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జనవరి 7 నుంచి వీటికి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

## ఉద్యోగ నోటిఫికేషన్లపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన



- వచ్చే మే 1లోగా కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని వెల్లడి
- మార్చి 31లోగా ఖాళీల వివరాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడి
- ఆరు నుంచి ఎనిమిది నెలల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామన్న టీజీపీఎస్సీ

## మద్యం ప్రియులకు షాక్.. కింగ్ ఫిషర్ బీర్లు బంద్..



- తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలు బంద్
- టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని..

హైదరాబాద్, జనవరి 08: తెలంగాణలో మద్యం ప్రియులకు షాకింగ్

## విశాఖ రోడ్లపై పూలవర్షం



- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లతో కలిసి మోదీ రోడ్ షో
- ఎన్డీయే కూటమి గెలిచాక ప్రధాని మోదీ తొలిసారి ఏపీ వచ్చిన నేపథ్యంలో... ప్రధాని పర్యటన
- అడుగడుగునా విజయోత్సాహం ప్రతిబింబించేలా భారీ ఏర్పాట్లతో రోడ్ షో

# మోదీకి ఘనస్వాగతం పలికిన చంద్రబాబు, పవన్...

- విశాఖలో మోదీకి ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం
- సిరిపురం జంక్షన్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ వరకు రోడ్ షో
- రూ. 2 లక్షల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న ప్రధాని



వివరాలు 2లో..

విశాఖపట్నం : జనవరి 08 ప్రధాని నరేంద్ర మోదీ విశాఖకు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగా విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సిరిపురం జంక్షన్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ వరకు రోడ్ షో ప్రారంభమయింది. ఈ రోడ్ షోలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పాల్గొం టున్నారు. రోడ్డుకు ఇరువైపుల నిల్చున్న ప్రజలకు ప్రధాని అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈనాటి కార్యక్రమం సందర్భంగా రూ. 2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ శ్రీకారం చుట్టనున్నారు. రైల్వేజోన్, ఇండస్ట్రియల్ హబ్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్ లకు శంకుస్థాపన చేయనున్నారు.

## ఏపీని నెంబర్ 1గా నిలబెడతాం



- అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తుందని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.
- 2 లక్షల కోట్లకు పైగా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో స్వర్ణాంధ్ర 2047 వైపు అడుగులు వేస్తున్నామని
- మూడవ స్థానానికి తీసుకువెళ్తామని మంత్రి ధీమాగా చెప్పారు.

విశాఖపట్నం, జనవరి 8: ఏపీని గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హబ్‌గా మారుస్తున్నామని మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖ వీఎంఆర్‌డీఏలో జరిగిన ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ఏపీని నెంబర్ వన్ స్థానాల్లో నిలబెడతామని చెప్పారు. మిగతా..2లో

# విశాఖలో మోదీ పర్యటన


విశాఖపట్నం : ప్రధాని నరేంద్ర మోదీ ఈ సాయంత్రం విశాఖలో పర్యటించనున్నారు. కాసేపట్లో ఆయన విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు మోదీ విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయంలో ప్రధానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వాగతం పలకనున్నారు. పవన్ కల్యాణ్ ఈ మధ్యాహ్నమే విశాఖ చేరుకోగా... చంద్రబాబు కూడా కొద్ది సేపటి క్రితమే బెంగళూరు నుంచి విశాఖ చేరుకున్నారు. సాయంత్రం 4.45 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రధాని రోడ్ షో ఉంటుంది. ప్రధానితో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా పాల్గొనే ఈ రోడ్ షో... సిరిపురం సెంటర్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజి గ్రౌండ్ వరకు నిర్వహించనున్నారు. రోడ్ షో అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కాలేజి గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన సభకు ప్రధాని మోదీ హాజరవుతారు. ఈ సభ సాయంత్రం 5.30 గంటల నుంచి 6.45 గంటల వరకు జరగనుంది. 6.50 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజి మైదానం నుంచి విశాఖ ఎయిర్ పోర్టుకు బయల్దేరతారు. రాత్రి 7.15 గంటలకు విశాఖ నుంచి భువనేశ్వర్ పయనమవుతారు. విశాఖలో మోదీ పర్యటన 3 గంటల పాటు సాగనుంది. విశాఖ సభ నుంచి ప్రధాని మోదీ వర్చువల్ గా పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ పనుల విలువ సుమారు రూ.2 లక్షల కోట్లు. విశాఖ రైల్వే జోన్ ప్రధాన పరిపాలనా భవనం, ఇండస్ట్రియల్ హబ్, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పూడిమడకలో ఏర్పాటయ్యే గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ తదితర ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపనలు చేయనున్నారు. దేశంలోని పలు జాతీయ రహదారులు, కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్, గుంటూరు-బీబీ నగర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు



- రోడ్ షో, సభకు హాజరుకానున్న ప్రధాని
- రూ.2 లక్షల కోట్ల విలువైన పనులకు వర్చువల్ గా శంకుస్థాపన, ప్రారంభోత్సవం

## మాదాపూర్‌లోని హోటల్లో భారీ అగ్ని ప్రమాదం

- డీమార్ట్ ఎదురుగా ఉన్న కృష్ణాస్ కిచెన్ రెస్టారెంట్‌లో ప్రమాదం
- మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నం
- చుట్టుపక్కల భారీగా అలుముకున్న మంటలు



హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇక్కడి డీమార్ట్ ఎదురుగా ఉన్న కృష్ణాస్ కిచెన్ రెస్టారెంట్‌లో ఈరోజు మధ్యాహ్నం ప్రమాదం జరిగింది. ప్రమాదం విషయం తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. అగ్ని ప్రమాదం కారణంగా ఆ చుట్టుపక్కల భారీగా పొగ అలుముకుంది. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కథనాలు వస్తున్నాయి. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. మిగతా..2లో

## మోదీ నిర్దేశకత్వం, చంద్రబాబు నాయకత్వం...


### ఇదే మా పంథా: పవన్ కల్యాణ్



ఒక సదుద్దేశం, ఒక సదాశయం లేకుండా ఒకరు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచినా అది ఒక నిరర్థకమైన నడకగా చరిత్రలో నిలిచిపోతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.. కానీ ఇంకొకరు ఒక సత్సంకల్పంతో, సదాశయంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలందరితో మమేకమై వారందరినీ ఏకతాటిపై నడిపిస్తే అది ఆత్మనిర్భర్ భారత్ అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇవాళ విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన ప్రజావేదిక సభకు పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు.

## విశాఖలో సీఎం చంద్రబాబు


- నగరంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ఎక్కడ లేని ఉత్సాహం
- రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాం.
- ఏపీ చరిత్రలోనే ఇది నిలిచిపోయే రోజు. భవిష్యత్‌లోనూ మా కూటమి
- అమరావతి నిర్మాణంలో మోదీ సహకారం కావాలి.



2లో

విశాఖ: నగరంలో ఏర్పాటు చేసిన రోడ్ షో అదిరిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ఎక్కడ లేని ఉత్సాహం వస్తోందని చంద్రబాబు తెలిపారు. విశాఖ సభకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరున నమస్కారాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడికెళ్లినా ప్రధాన మంత్రిపై ప్రజలు నమ్మకం చూపిస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ ప్రజలకు మోదీపై నమ్మకం, విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి చేతులమీదుగా రూ. 2.08,545 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి సంఘటన తన జీవితంలో, ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..” విశాఖ రైల్వేజోన్ కల సాకారమైంది. రూ. 2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాం. ఏడు రైల్వే ప్రాజెక్టులకు సైతం శంకుస్థాపనలు చేసుకున్నాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వస్తోంది. పూడిమడక దగ్గర ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్క్‌కు శంకుస్థాపన

## కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు



- ఈ పిటిషన్‌పై తీర్పును సాయంత్రం 4 గంటలకు వెల్లడిస్తామని న్యాయస్థానం
- “ఒక రూంలో ఇన్వెస్టిగేషన్.. ఇంకో రూములో అడ్వకేట్ కూర్చుంటే ఏం ప్రాబ్లం..
- ఒక ముగ్గురి న్యాయవాదుల పేర్లు ఇవ్వాలని కేటీఆర్ న్యాయవాదికి చెప్పిన ధర్మాసనం..

హైదరాబాద్, జనవరి 8: ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏసీబీ విచారణకు న్యాయవాదిని అనుమతించాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. మిగతా..2లో

## కింగ్ ఫిషర్ బీర్ల నిలిపివేత..

### బిర్యానీ బీర్ల ప్రోత్సాహానికేనా..?



హైదరాబాద్ : తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్లు అమ్మకాలు నిలిపి వేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. తెలంగాణకు కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ తీసుకున్న నిర్ణయం అనేక ప్రశ్నలకు తావిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ బకాయిలు చెల్లించలేదని యూబీఎల్ పేర్కొంది. బీర్ల విక్రయాలు నిలిపివేస్తే ప్రీమియం బ్రాండ్లు కింగ్ ఫిషర్, హీనెకెన్‌కు అంతరాయం కలుగుతుంది. స్థానిక బ్రాండ్లు బూమ్ బూబ్ బీర్, బిర్యానీ బీర్ల ప్రోత్సాహానికి చేస్తున్న ప్రయత్నమా..? బిల్లుల చెల్లింపులో ప్రత్యేక ప్రాధాన్యతల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం సీనియారిటీ ఆధారంగా బిల్లులను క్లియర్ చేసేది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ధరల విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల తెలంగాణలో కంపెనీ నిర్వహణ నష్టాలు పెరిగాయని.. అందువల్ల, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి సరఫరాలను వెంటనే నిలిపి వేయాలని యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ నిర్ణయించింది. గత రెండు సంవత్సరాలుగా ధరలు పెంచకపోవడంతో నష్టాలు పెరిగాయని.. తెలంగాణ రాష్ట్రంలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలు నిలిపి వేస్తున్నట్టు ప్రకటించింది.

# మద్యం ప్రియులకు షాక్..

మొదటి పేజీ తరువాయి

ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలు బంద్ కానున్నాయి. ఇందుకు కారణం.. ఆ బీర్ల తయారీ కంపెనీ తీసుకున్న నిర్ణయమే. అవును.. తెలంగాణకు తమ బీర్లను సప్లయ్ చేయబోమంటూ యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తేల్చి చెప్పింది. ఈ మేరకు బుధవారం నాడు అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. బీర్ల ధరలను సవరించకపోవడంతో పాటు.. పాత బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయంతో.. తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరా నిలిచిపోనుంది.

### కంపెనీ ప్రకటనలో ఏముందంటే..

సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 30కి ప్రకారం.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కి తమ బీర్ సరఫరాను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తన లేఖలో పేర్కొంది. టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని.. దీని కారణంగా రాష్ట్రంలో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. అలాగే.. బీర్ల సరఫరాకు సంబంధించి తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చాలా బకాయి పడిందని.. ఆ బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీ తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఈ కారణంగా టీజీబీసీఎల్‌కి బీర్లను సరఫరా చేయడం సాధ్యం కాదని, ఇక నుంచి బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ తన లేఖలో స్పష్టం చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని యూబీఎల్ విజ్ఞప్తి చేసింది.

# మాదాపూర్‌లోని హెూటల్లో భారీ అగ్ని ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ హెూటల్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇక్కడి డీమార్ట్ ఎదురుగా ఉన్న కృష్ణాస్ కిచెన్ రెస్టారెంట్‌లో ఈరోజు మధ్యాహ్నం ప్రమాదం జరిగింది. ప్రమాదం విషయం తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. అగ్ని ప్రమాదం కారణంగా ఆ చుట్టుపక్కల భారీగా పొగ అలుముకుంది. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కథనాలు వస్తున్నాయి. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# విశాఖ రోడ్లపై పూలవర్షం

మొదటి పేజీ తరువాయి



విశాఖపట్నం : జనవరి 08 విశాఖ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లతో కలిసి మోదీ రోడ్ షో లో పాల్గొన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ త్రయం ఎక్కిన ప్రత్యేక వాహనం నిదానంగా ముందుకు సాగుతుండగా... ప్రజలు పూలవర్షం కురిపించారు. సిరిపురం సెంటర్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కాలేజి వరకు రోడ్డుకు ఇరువైపులా జనం పోటెత్తారు. ఎన్నికల వేళ ఇదే త్రయం విజయవాడలో నిర్వహించిన భారీ రోడ్ షోను తలదన్నేలా నేడు విశాఖలో రోడ్ షో జరిగింది. ఎన్డీయే కూటమి గెలిచాక ప్రధాని మోదీ తొలిసారి ఏపీ వచ్చిన నేపథ్యంలో... ప్రధాని పర్యటనను ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అడుగడుగునా విజయోత్సాహం ప్రతిబింబించేలా భారీ ఏర్పాట్లతో రోడ్ షో ఏర్పాటు చేసింది. కాగా, మోదీ, చంద్రబాబు, పవన్ వాహనం నేరుగా ఏయూ ఇంజినీరింగ్ కాలేజి మైదానంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలోకి ప్రవేశించింది. సభకు విచ్చేసిన ప్రజలకు అభివాదం చేస్తూ ముగ్గురు నేతలు ముందుకు సాగారు. ఇక, ఈ సభ ద్వారా మోదీ ఏపీకి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇక, వేదికపైకి చేరుకున్న అనంతరం... ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు సత్కరించారు. మోదీకి శేషశయనుడి విగ్రహం, అరకు కాఫీని బహూకరించారు. వేదికపై మోదీ, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హెూంమంత్రి అనిత, మంత్రి నారా లోకేశ్ తదితరులు ఆసీనులయ్యారు.

# విశాఖలో సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి



ఏపీ చరిత్రలోనే ఇది నిలిచిపోయే రోజు. భవిష్యత్‌లోనూ మా కూటమి కొనసాగుతుంది. ఢిల్లీలో గెలవబోయేది ఎన్డీఏనే. మేమంతా మోదీతోనే ఉంటాం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ప్రజలకు దగ్గరైన వ్యక్తి మోదీ. మా కాంబినేషన్ ఎప్పటికీ ఉంటుంది. ప్రధానిగా మోదీ ఉంటారు. ప్రపంచం మెచ్చే నాయకుడు మోదీ. దేశం కోసం పనిచేసే నాయకుడు మోదీ. విభజన వేళ ఏపీకి అన్యాయం జరిగిందని చెప్పిన వ్యక్తి మోదీ. 7 మండలాలను రాష్ట్రంలో విలీనం చేసిన వ్యక్తి మోదీ. ఒక్కో ఇటుక పేర్చుకుంటూ రాష్ట్ర పునర్ నిర్మాణం చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి తీరుతాం. ఐఐటీ, ఐఐఎం, నిట్, ఎయిమ్స్, ట్రైబల్, సెంట్రల్ వర్సిటీలతోపాటు 12 యూనివర్సిటీలు ఏపీకి కేటాయించారు. కేంద్రం సాయంతో నిలదొక్కుకుని ముందుకెళు_న్నాం. రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. కష్టాలు, సమస్యలను అధిగమించి ముందుకెళ్తాం. కేంద్రం సాయంతో ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకుంటున్నాం. మోదీ నుంచి నేను ఎప్పుడూ స్ఫూర్తి పొందుతుంటా. అమరావతి నిర్మాణంలో మోదీ సహకారం కావాలి. అమరావతిని త్వరలో పూర్తి చేస్తాం. మోదీ సారథ్యంలోనే పోలవరం, నదుల అనుసంధానం పూర్తి చేస్తామని" చెప్పారు.

# ఉద్యోగ నోటిఫికేషన్లపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

అమరావతి : ఉద్యోగ నోటిఫికేషన్లపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన చేసింది. వచ్చే మే 1వ తేదీ నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఇందుకోసం, మార్చి 31 లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపింది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి ఆరు నుంచి ఎనిమిది నెలల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం గ్రూప్స్ ఫలితాలు విడుదలయ్యేలా చూస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని వెల్లడించారు. ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు.

### టీజీపీఎస్సీ గ్రూప్ 3 ప్రిలిమినరీ కీ విడుదల

రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించింది. మూడు పేపర్లకు నిర్వహించిన ఈ పరీక్షలకు 5.36 లక్షల మంది హాజరయ్యారు.

# కేటీఆర్‌పై మరో ఫిర్యాదు..




హైదరాబాద్, జనవరి 08: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా ఉన్న కేటీఆర్‌పై మరో ఫిర్యాదు ఏసీబీ, ఈడీలకు చేరింది. ఓఆర్ఆర్ టోల్ అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు చేయాలంటూ యుగేందర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ ఫార్ములా రేస్ ఒక్కటే కాదు.. ఓఆర్ఆర్ అక్రమాలపైనా విచారణ జరపాలని కోరారు. సీఎం, సీఎస్, ఈడీలతో పాటు ఏసీబీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఓఆర్ఆర్ చుట్టూ మెయింటెనెన్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతం అంతా హెచ్ఎండీఏ చేస్తుందన్నారు. ఐఆర్బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కైటెక్స్ గార్మెంట్స్ కంపెనీలకు ఓఆర్ఆర్‌కు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి ముప్పై ఏళ్ల పాటు మెయింటెనెన్స్ ఇచ్చారన్నారు. రూ. 25 కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చింది కాబట్టే ఓఆర్ఆర్ మెయింటెనెన్స్ ఇచ్చిందని యుగేందర్ గౌడ్ తన ఫిర్యాదులో ఆరోపించారు. %ఈ వ్యవహారంలో క్విడ్ ప్రోకో ఇక్కడ చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. హెచ్ఎండీఏ నిధులపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని యుగేందర్ డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంలో అధికారుల పాత్రపైనా దర్యాప్తు జరపాలని కోరారు. కాగా, ఓఆర్ఆర్ టోల్ లీజ్ వ్యవహారంపై కేటీఆర్‌తో పాటు కేసీఆర్ పైనా ఈడీ ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎలక్టోరల్ బాండ్స్‌పై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎలక్టోరల్ బాండ్స్‌ను స్క్రూటినీ చేసి ప్రభుత్వ కాంట్రాక్టు, పాలసీ నిర్ణయాలపై దర్యాప్తు జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# యువతకు జాబ్ ఆఫర్స్..

అయితే దీనికి అప్లై చేయాలంటే ఎలాంటి అర్హతలు ఉండాలి, ఎంత జీతం వస్తుందనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

### ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ కోసం పెళ్లికాని పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నిపథ్ పథకం కింద ఈ రిక్రూట్‌మెంట్ నాలుగు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ఈ వ్యవధి తర్వాత 25 శాతం మందికి ఎయిర్ ఫోర్స్‌లో శాశ్వత ఉద్యోగాలు ఇవ్వబడతాయి. ఈ పరీక్ష మార్చి 22, 2025న నిర్వహించబడుతుంది. దీని కోసం దరఖాస్తు చేసేందుకు జనరల్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు రూ. 550 ఫీజుగా నిర్ణయించారు. డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ అభ్యర్థుల కనీస వయస్సు 17.5 సంవత్సరాలు కాగా, గరిష్ట వయస్సు 21 సంవత్సరాలు ఉండాలి.

### ఎలాంటి చదువు ఉండాలి

/గణితం, భౌతికశాస్త్రం, ఆంగ్లంతో ఇంటర్మీడియట్ లో కనీసం 50% మొత్తం మార్కులు, ఆంగ్లంలో 50% స్కోర్ ఉండాలి సంబంధిత విభాగంలో 50% మొత్తం మార్కులతో ఇంజనీరింగ్‌లో డిప్లొమా, ఆంగ్లంలో 50% మార్కులు ఉండాలి ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌తో ఒకేషనల్ కోర్సు, కనీసం 50% మొత్తం మార్కులు, ఆంగ్లంలో 50% స్కోర్ ఉండాలి



### జీతం ఎంత ఉంటుంది?

ఇందులో ఎంపికైన యువతీయువకులకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో రూ. 48 లక్షల జీవిత బీమా అందిస్తారు. ఇది కాకుండా అగ్నిపథ్ స్కీం ద్వారా ఇతర అనేక ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉంటాయి. దీంతోపాటు మొదటి ఏడాదిలో నెలకు రూ.30,000, రెండో సంవత్సరంలో రూ.33,000, మూడో సంవత్సరంలో రూ.36,500, చివరిగా నాలుగో సంవత్సరంలో నెలకు రూ. 40,000 అందజేస్తారు. ఇలా ఎంపికైన యువత తక్కువ వయస్సు నుంచే మంచి వేతనాన్ని పొందవచ్చు.

# మోదీ నిర్దేశకత్వం, చంద్రబాబు నాయకత్వం...

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. "కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలకు వారి పరిసరాల శుభ్రత భాధ్యతను తెలియజేస్తే అది స్వచ్ఛ భారత్ అవుతుంది. అదే కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రజల్లో ధైర్యసాహసాలు నింపితే అది ఒక బలిష్టమైన, పటిష్టమైన భారత్ అవుతుంది. అది ఒక రోజున అఖండ భారత్ అయి తీరుతుంది. భారత్ ను ప్రపంచ దేశాల్లో మూడో బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా నడిపిస్తున్న మన ప్రియతమ ప్రధానికి నా తరఫున, ఐదు కోట్ల మంది ఆంధ్రుల తరపున హృదయపూర్వక నమస్కారాలు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించి, రెవెన్యూ మంత్రిగా, ఆర్థికమంత్రిగా అంచెలంచెలుగా ఎదిగి, టీడీపీ రథ సారథి అయి, నాలుగోసారి ముఖ్యమంత్రి అయి, తెలుగు ప్రజలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రాజకీయ ఉద్ధండులు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నా హృదయపూర్వక నమస్కారాలు. నా సహచర మంత్రి నారా లోకేశ్ కు, ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, బీజేపీ నేతలకు పేరుపేరునా నమస్కారాలు. మాకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు పేరుపేరునా నమస్కారాలు. ఇవాళ ప్రధాని మోదీ 7 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ.2.10 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. అవినీతితో కూరుకుపోయి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక విలవిల్లాడుతున్న తరుణంలో మీరు మా కోసం నిలబడ్డారు. లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులతో మాకు అండగా నిలుస్తున్నందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు. 24 గంటలు తాగునీరు, మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు వేయగలుగు తున్నామంటే అందుకు కారణం మోదీ గారు వెన్నుతట్టి మద్దతుగా నిలుస్తున్నారు. గత ఐదేళ్ల అవినీతి, అరాచక పాలనతో ఏపీ అంధకారంలో మునిగిపోయినప్పుడు... ఆంధ్రాకు ఇక ఎలాంటి అవకాశమే లేదు అనుకున్న సమయంలో... ఇటువంటి స్థితి నుంచి అభివృద్ధి అంటే ఆంధ్రానే అనుకునేలా చంద్రబాబు నాయకత్వంతో ప్రధాని మోదీ నిర్దేశకత్వంలో వారి సూచనలు, సలహాలతో మా మంత్రి వర్గం, కార్యకర్తలు అభివృద్ధిలో భాగమవుతాం. ప్రజలు మాపై నమ్మకం పెట్టారు....ఆ నమ్మకం ఫలితమే ఇవాళ రూ.2 లక్షల కోట్లకు పైగా పనులు రాష్ట్రానికి వచ్చాయి. ఈ దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేలా ప్రధాని మోదీకి ఆ లక్ష్మీనరసింహస్వామి దీర్ఘాయుష్షును ఇవ్వాలని కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఏపీని నెంబర్ 1గా నిలబెడతాం

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రాన్ని డిజిటల్ రెవల్యూషన్ వైపు నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. డ్రోన్ల టెక్నాలజీని సహాయ కార్యక్రమాల్లోనూ వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు విశాఖకు వస్తున్నారని.. సుమారు 2 లక్షల కోట్లకు పైగా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని అన్నారు. ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్.. భవిష్యత్తు టెక్నాలజీ అభివృద్ధికి వేదిక కానుందన్నారు. టెక్నాలజీ మాత్రమే కాదు విజన్ కూడా ఎంతో ముఖ్యమని... అప్పుడే మనం అనుకునే లక్ష్యాల్ని సాధించగలమని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో స్వర్ణాంధ్ర 2047 వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఎన్ఆర్ఐఎఫ్ రాకింగ్‌లో ఏపీ 9వ స్థానంలో ఉందని.. మూడవ స్థానానికి తీసుకువెళ్తామని మంత్రి ధీమాగా చెప్పారు. చిత్తూరు, తిరుపతి ఎలక్ట్రానిక్ హబ్‌గా తయారుస్తున్నామన్నారు. గోదావరి జిల్లాలో ఆక్వా పరిశ్రమపై ఫోకస్ చేస్తున్నామని.. డ్రోన్ టెక్నాలజీపై దృష్టి పెట్టామన్నారు. విశాఖను ప్రపంచానికి డేటా సిటీగా తయారు చేస్తామని అన్నారు. రూ.500 కోట్ల బడ్జెట్ స్టార్ట్ అప్ పరిశ్రమల కోసం కేటాయించామన్నారు. విద్యా రంగంలో అనేక సంస్కరణలను ప్రవేశపెడుతున్నామన్నారు. విద్యా సంస్థలను పరిశ్రమలతో అనుసంధానం చేస్తున్నాము. యువతలో స్కిల్స్‌ను పెంపొందిస్తున్నామని తెలిపారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తుందని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కాగా.. విశాఖలో జనవరి 8, 9 తేదీల్లో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు జరుగనుంది. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో ఐటీ, ఐటీఈఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీ, మెడికల్ అండ్ హెల్త్ టెక్నాలజీ, క్రియేటివ్ టెక్నాలజీలపై చర్చలు జరుగనున్నాయి. ఈ సదస్సుకు ఏపీ ప్రభుత్వం, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా సహకారం అందిస్తోంది.

# కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



కేటీఆర్ తరపున లాయర్ వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై తీర్పును సాయంత్రం 4 గంటలకు వెల్లడిస్తామని న్యాయస్థానం తెలిపింది. తీర్పును సాయంత్రానికి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సమయంలో న్యాయవాది సమక్షంలో విచారణకు అనుమతి ఇవ్వలేదని.. ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్న విషయాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది. ఎంపీ అవినాష్‌రెడ్డి సీబీఐ కేసులో తాము ఇచ్చిన ఆర్డర్ కాపీ చదివారా అని హైకోర్టు ప్రశ్నించింది. న్యాయవాదిని అనుమతించిన పలు సుప్రీం కోర్టు తీర్పులను కేటీఆర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా.. న్యాయవాదిని విచారణ సందర్భంలో అనుమతి ఇవ్వని పలు తీర్పులను ఏఏజీ రజనీకాంత్ రెడ్డి ప్రస్తావించారు. ఏసీబీ విచారణ సమయంలో కనిపించేంత దూరంలో న్యాయవాది కనిపించేలా విచారణ గదులు ఉన్నాయా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. "ఒక రూంలో ఇన్వెస్టిగేషన్.. ఇంకో రూములో అడ్వకేట్ కూర్చుంటే ఏం ప్రాబ్లం.. ఏసీబీలో అలాంటి వసతులు ఉన్నాయా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. న్యాయవాదికి కేటీఆర్ కనిపించేలా విజిబుల్ డిస్టెన్స్‌కు ఏసీబీలో సౌకర్యం ఉందో లేదో చెప్పాలని ఏఏజీకి హైకోర్టు ఆదేశించింది. దీనిపై సాయంత్రం 4 గంటలకు చెబుతామని కోర్టుకు ఏఏజీ తెలిపింది. విచారణ గదిలోకి నిందితుడితో న్యాయవాదిని కలిసి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. కానీ ఇక్కడ కేటీఆర్ గతంలో మాజీ మంత్రి , ప్రస్తుత ఎమ్మెల్యే కాబట్టి.. న్యాయవాదికి కనిపించేలా విచారణ గదిలో ఏర్పాట్లు ఉన్నాయా అని హైకోర్టు ప్రశ్నించింది.

### ఏసీబీ వరుస ప్రశ్నలు.. షాక్‌లో ఐఏఎస్

కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించరు కదా అని న్యాయస్థానం ప్రశ్నించింది. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించే అవసరం లేనప్పుడు.. ఇన్వెస్టిగేషన్ రూమ్‌లో న్యాయవాది ఉండడం ఎందుకు అని ప్రశ్న వేసింది కోర్టు. ఒక ముగ్గురి న్యాయవాదుల పేర్లు ఇవ్వాలని కేటీఆర్ న్యాయవాదికి చెప్పిన ధర్మాసనం.. వారిలో ఒకరిని విజిబుల్ డిస్టెన్స్ వరకు మాత్రమే అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. అనంతరం తీర్పును ఈరోజు సాయంత్రం 4 గంటలకు హైకోర్టు వాయిదా వేసింది.

# రాసి పెట్టుకోండి... ఢిల్లీ ఎన్నికల్లో గెలిచేది ఎన్డీయే

ఇవాళ విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న రోడ్ షో అదిరిపోయిందని, బ్రహ్మాండంగా జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ రోజు మన రాష్ట్రానికి చరిత్రలో మిగిలిపోయే రోజు అని అభివర్ణించారు. ప్రధాని చేతుల మీదుగా రూ.2,08,548 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఇవాళ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశాం అని వెల్లడించారు. ఇలాంటి శుభదినం నా జీవితంలో, ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా జరిగిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో అండగా ఉన్న ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. "చిరకాల వాంఛ అయిన విశాఖ రైల్వే జోన్ కు గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి ఆశీస్సులతో విశాఖ రైల్వే జోన్ పనులు ప్రారంభం అయ్యాయి. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ కోసం రూ.1877 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం. కృష్ణపట్నం వద్ద క్రిష్ సిటీ కోసం రూ.2,300 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం. రూ.6,177 కోట్లతో ఏడు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాం. మూడు రైల్వే ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. ఏడు జాతీయ రహదారులకు ప్రారంభోత్సవం చేస్తున్నాం. మా ప్రభుత్వం వచ్చి ఏడు నెలలే అయింది. ఎన్నికలయ్యాక మోదీ మొదటిసారిగా రాష్ట్రానికి వచ్చారు. రావడంతోనే రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారంటే... ఆంధ్ర రాష్ట్రమంతా వినిపించేలా గట్టిగా చప్పట్లు కొట్టి ఆయనను అభినందించాలి. అనునిత్యం అండగా నిలుస్తూ, అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్న వ్యక్తి నరేంద్ర మోదీ. మోదీ అభిమానం ఉత్తరాదికే పరిమితం అని కొందరు మాట్లాడుతున్నారు... కానీ దేశం, ప్రపంచం మొత్తం మెచ్చే నాయకుడు ప్రధాని మోదీ. మొన్నటి ఎన్నికల్లో మోదీ, మిత్రుడు పవన్ కల్యాణ్, నేను కలిశాం. నేను నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నాను. కానీ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ కూడా ఇంత భారీ స్థాయిలో గెలవలేదు. 93 శాతం స్ట్రయిక్ రేట్, 57 శాతం ఓట్లేశారు, 175కి 164 సీట్లు గెలిచాం. 25కి 21 పార్లమెంటు సీట్లు గెలిచాం. భవిష్యత్తులో ఎప్పుడూ కూడా ఏపీలో ఈ కాంబినేషన్ ఉంటుంది... దేశ రాజకీయాల్లో మోదీనే ప్రధానిగా ఉంటారు. ఇటీవల హర్యానాలో, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి... ఈ రెండు చోట్ల ఎన్డీయే కూటమి తిరుగులేని విజయం సాధించింది. రేపు ఢిల్లీ ఎన్నికలు వస్తున్నాయి.... రాసిపెట్టుకోండి.... ఢిల్లీలో గెలవబోయేది ఎన్డీయే. దానికి కారణం నరేంద్ర మోదీ. దేశం కోసం పనిచేస్తే ప్రజలందరూ వెంట నిలుస్తారు. ఇందుకు ఇవాల్టి సభలో మోదీ మోదీ నినాదాలే అందుకు నిదర్శనం. సంస్కరణలు, సుపరిపాలనతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకువెళుతున్నారు. పీఎం కిసాన్ కింద రైతులకు ఏడాది రూ.6 వేలు ఇస్తున్నారు. కొవిడ్ సమయంలో ప్రారంభించిన రూ.5 కేజీల బియ్యం పథకాన్ని ఇవాళ కూడా కొనసాగిస్తున్నారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చడానికి మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, గతి శక్తి వంటి విప్లవాత్మక కార్యక్రమాలతో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఇళ్లు లేని కోట్లాది పేదలకు ఇళ్లు కట్టించారు. జనవరి 1న ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి నేను రైతులతోనే ఉంటాను అని చెప్పిన వ్యక్తి నరేంద్ర మోదీ. నాలుగు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా పీఎం ఫసల్ బీమా పథకం అమలు చేస్తున్నారు. రూ.3,850 కోట్లతో ఎరువుల సబ్సిడీ కొనసాగించాలని క్యాబినెట్ లో నిర్ణయించారు. పేదల కోసం పీఎం సూర్యఘర్, కుసుమ్ వంటి పథకాలు తీసుకువచ్చారు. ఎవరి ఇంటిపై వారే సౌర శక్తిని ఉపయోగించుకుని కరెంటు తయారుచేసుకునే పథకాలు ఇవి. భవిష్యత్తులో కరెంటు చార్జీల భారం లేకుండా పేదలకు అండగా నిలిచే పథకాలు తీసుకువచ్చారు. ఇవన్నీ ఏడు నెలల్లో చేయగలిగారు. వారి విధానం... సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్... ఇదే నినాదంతో ముందుకు వెళుతున్నారు. 2014లో భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉంటే, ఇప్పుడు ఐదో స్థానంలో ఉంది. 2029కి మూడో స్థానంలోకి వచ్చే భారతదేశం... 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుంది. ఇది వేరేవాళ్లకు సాధ్యం కాదు...

మరో ఉదయం

## సంపాదకీయం

# ‘జమిలి’తో అధికారాల ఏకీకరణ

‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ నినాదంతో జమిలి ఎన్నికలకు రంగాన్ని సిద్ధం చేయడానికి మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులను ప్రవేశపెట్టింది. ఇవి ఆమోదం పొందితే పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. సహజంగానే ఈ అంశంపై కూడా అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం వాదోపవాదాలు చేస్తున్నాయి. అయితే సాధారణ ప్రజల స్పందన భిన్నంగా ఉంది. ప్రజాస్వామ్య సూత్రాలు, విలువలు, వాటి స్ఫూర్తి, ఆచరణ ప్రాధాన్యతను కోల్పోయి కేవలం మనీ, మీడియా, మూక బలాలు ప్రాబల్యం వహిస్తూ, మొత్తం ఎన్నికల ప్రక్రియే ఒక ప్రహసనంగా మారిన ప్రస్తుత పరిస్థితులలో ఎన్నికలు ఏ రూపంలో జరిగినా ఏం ఫాయిదా? అనే ప్రతిస్పందన వినిపిస్తుంది. అసలు జమిలి అంశం నేడు ఎందుకు ముందుకు వస్తోంది? దీని వెనుకనున్న అసలు ఉద్దేశ్యాలేమిటి? వంటి ముఖ్య ప్రశ్నలు వేయడం చాలా అవసరం. జమిలి ఎన్నికలకు అనుకూలంగా మూడు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పలుమార్లు జరిగే ఎన్నికల వలన అధిక ఆర్థిక వ్యయం అవుతోందని, జమిలితో గణనీయంగా ఎన్నికల ఖర్చును తగ్గించవచ్చునని, దేశ జీడీపీలో అదనంగా 10 శాతం వృద్ధి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ వీరు ఈ వాదనకు తగిన పరిశోధనలనుగానీ, సముచిత డాటా ఆధారిత రుజువులనుగానీ చూపించలేదు. కేవలం సాధారణ తర్కాన్ని ఉపయోగించడం, కొన్ని దేశాల ఎన్నికలను ఉదహరించడం జరిగింది. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు అయ్యే ప్రభుత్వ ఖర్చుకంటే బడా పార్టీలు ఓటర్లకు ఎర వేయడానికి అనేక రెట్లు ఎక్కువ ఖర్చు చేసే వేల కోట్ల రూపాయల అక్రమ ధనాన్ని అరికట్టే చర్యలు చేపడితే అందరూ హర్షిస్తారు. అలాగే ఎక్కువసార్లు ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించే సందర్భాలలో అమలుచేసే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వలన ప్రభుత్వ పాలనకు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అనేక ఆటంకాలు వస్తున్నాయని కూడా చెప్పడం జరుగుతోంది. అయితే వాస్తవం ఏమిటి? ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించిన తరువాత ఓటర్లను ప్రలోభపెట్టే కొత్త పథకాలు, ప్రాజెక్టుల ప్రకటనలను మాత్రమే ఎంసీసీ నిషేధిస్తుంది. అంతేకాని అప్పటికే అమలులోనున్న వాటిపై ఎలాంటి పరిమితులను విధించదు. ఇక ఎన్నికల సందర్భంగా చేపట్టే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు లేదా సైనిక దళాలను నియమించడం తదితర విషయాలలో ఒకేసారి జరిగినా, ఎక్కువసార్లు జరిగినా పెద్ద మార్పేమీ ఉండదు. ఇవన్నీ ప్రజలను ఒప్పించడానికి పైకి చెబుతున్న వాదనలు. వీటి సత్యాసత్యాలను అటుంచి, మనదేశ సామాజిక వ్యవస్థ నిర్మాణంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని, ప్రాంతీయ వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకొని జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలిస్తే అసలు విషయం స్పష్టమవుతుంది. అది జాతీయ పెట్టుబడి ఆధిపత్యానికి, ప్రాంతీయ పెట్టుబడి ఆకాంక్షలకు మధ్యనున్న వైరుధ్యం. దీని రాజకీయ వ్యక్తీకరణే జాతీయ స్థాయిలోని పార్టీలకు ప్రాంతీయ పార్టీలకు మధ్య పోటీలు, ఘర్షణలు, బేరసారాలు, లొంగుబాట్లు, కాళ్ళబేరాలు. ఈ వైరుధ్యం మన దేశ ఆర్థిక అభివృద్ధిలో, రాజకీయ పరిణామంలో వివిధ దశలగుండా పయనిస్తూ వస్తోంది. మొదట స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రాంతీయ పెట్టుబడి ఒక శక్తిగా రూపొందని కాలంలో జాతీయ పెట్టుబడి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఏకఛత్రాధిపత్యం వహించింది. అనంతర కాలంలో ముఖ్యంగా 1970 దశకం పూర్వార్థం నుంచి ప్రాంతీయ పెట్టుబడుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు రాజకీయ రంగంలో ఆవిర్భవించి, రాష్ట్రాల ఎన్నికల పోటీలో గెలిచి అధికారాన్ని చేపట్టాయి. అప్పటి నుంచి ఈ వైరుధ్యం తీవ్ర రూపం దాల్చడం కనిపిస్తుంది. అప్పటికి జాతీయంగానూ, దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ అపఖ్యాతిపాలు కాగా, దానికి ప్రత్యామ్నాయంగా అదే జాతీయ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే మరొక జాతీయ పార్టీ ఆవిర్భావానికి జనతా పార్టీ రూపంలో చేసిన ప్రయోగం కూడా ఆ వైరుధ్యాన్ని టాకిల్ చేసే క్రమంలో జరిగింది. దీని ద్వారా అమెరికా, ఇంగ్లండ్‌ల తరహాలో ద్విపార్టీ పాలనను ప్రతిష్ఠించే ప్రయత్నం ప్రారంభమైంది. అంటే ఒక జాతీయ పార్టీ ప్రజల్లో పరపతిని కోల్పోయినప్పుడు మరొక జాతీయ పార్టీని ఛాంపియన్‌గా ఆకాశానికెత్తి అధికారంలోకి తేవడం.

# పాఠశాలల అభివృద్ధికి పీఎం ఎస్ఆర్ఐ పథకంలో జిల్లాకు ఐదు కోట్లు కేటాయింపు

### తొలివిడత 22 పాఠశాలలకు ఐదు కోట్ల రూపాయల కేటాయింపు

### ల్యాబ్స్, లైబ్రరీ గదులు తదితర పనులు చేసేలా ప్రణాళిక.. రెండో విడతలో మరిన్ని

భీమవరం రూరల్, : ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంతో (పీఎం ఎస్ఆర్ఐ) ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధుల వరద పారనుంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు చేసే అభివృద్ధితోపాటు కేంద్ర ప్రభుత్వం కొన్ని పాఠశాలలను ఎంచుకుని పీఎం ఎస్ఆర్ఐ పథకం ద్వారా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో మొదట విడతగా 22 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.5 కోట్లను కేటాయించి వీటిని అభివృద్ధి చేయనున్నారు. విద్యా బోధనలో భాగంగా అన్ని సౌకర్యాలు అందించే దిశగా ఈ పథకం అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఇప్పటికే అన్ని పాఠశాలలను అభివృద్ధి చేసింది. జిల్లాలో 1375 ప్రభుత్వ పాఠశాలల్లో 99 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఉన్నత విద్యను అందించడంతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. పీఎం ఎస్ఆర్ఐ పథకం ద్వారా అవసరం ఉన్నచోట తాగునీటి ఆర్వో ప్లాంట్‌లు, లైబ్రరీ రూమ్‌లు, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లు, కిచెన్ గార్డెన్ ఫినిషింగ్‌లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, సోలార్ ప్యానల్స్ వంటి అభివృద్ధి పనులు చేయనున్నారు. సైకిల్ ర్యాంప్‌లతోపాటు క్రీడా మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి క్రీడల కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ల్యాబ్‌లో ఎక్విప్‌మెంట్స్‌ను ఏర్పాటు చేస్తారు. మొదటి విడత ఎంపికైన పాఠశాలల్లో పనులన్నీ పూర్తయ్యాక 2వ విడత మరికొన్నింటిని ఎంపిక చేసి అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకం ద్వారా కేటాయించిన నిధులతో పనులు చేయనున్నట్లు సమగ్ర శిక్ష డీఈ శక్తీశ్వరరావు తెలిపారు.

### ఎంపికైన పాఠశాలలు

తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూలు, తణుకు జడ్పీ హైస్కూ లు, ఇరగవరం జడ్పీ హైస్కూలు, చినకాపవరం జడ్పీ హైస్కూలు, ఆకివీడు జడ్పీ హైస్కూలు, కలవపూడి జడ్పీ హైస్కూలు, పెనుమంట్ర జడ్పీ హైస్కూలు, ఆచంట వేమవరం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ స్కూల్, ఎల్‌బీ చర్ల ఉన్నత పాఠశాల, పెంటపాడు జీహెచ్‌ఎస్ పాఠశాల, యండగండి పీహెచ్‌ఎస్ పాఠశాల, గూట్లపాడు జడ్పీ హైస్కూలు, భీమవరం జేఎల్‌బీ గరల్స్ ఉన్నత పాఠశాల, మొగల్లు జడ్పీ హైస్కూలు, కవిటం జడ్పీ హైస్కూలు, పాలకొల్లు బిఆర్ఎంవి మునిసిపల్ ఉన్నత పాఠశాల, కరగట్ల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, బల్లిపాడు జడ్పీ హైస్కూలు, వీరవాసం జడ్పీ హైస్కూలు, వేమవరం జడ్పీ హైస్కూలు, శివదేవుని చిక్కాల జడ్పీ హైస్కూలు, మొగల్తూరు జడ్పీ హైస్కూలు ఉన్నాయి.

### ప్రత్యేక దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం



### ఇప్పటికే క్వాలిపై లెక్చరర్ల ఏర్పాటుకు నిర్ణయం

### ఒకటి నుంచి మధ్యాహ్న భోజనం ఏర్పాటు

### ల్యాబ్‌లు, అదనపు గ్రూపులపైనా దృష్టి పెట్టాలి

భీమవరం రూరల్, : విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చి, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం ప్లస్ టూ జూనియర్ కళాశాలల అభివృద్ధికి, వాటిలో సౌకర్యాలు పెంచాలి. గత ఏడాది వరకు ప్లస్ వన్ మహిళా జూనియర్‌కళాశాలలుగానే కొనసాగాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అదనంగా కో%-%ఎడ్యుకేషన్ ప్లస్ వన్ జూనియర్ కళాశాలలుగా మరికొన్ని కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థుల సంఖ్య కొంత పెరిగినప్పటికీ కళాశాలల్లో విద్యకు సంబంధించి సౌకర్యాలు మరికొన్ని అందుబాటులోకి తీసుకువస్తేనే అవి రానున్న రోజుల్లో విద్యార్థులకు ఆకర్షణగా నిలుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 25 ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా వీటిలో 16 ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాలలుగా, 9 కో%-%ఎడ్యుకేషన్ కళాశాలలుగా కొనసాగుతున్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కింద 470 మంది విద్యార్థులు చదువుతున్నారు.

### సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాలలు రెండేళ్ల క్రితం అందుబాటులోకి తీసుకువచ్చినా విద్యార్థులకు కావలసిన ప్రొఫెసర్లు గాని, ఎక్విప్‌మెంట్స్, ల్యాబ్‌లు ఏవీ ఏర్పాటు చేయలేదు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులతోనే విద్యాబోధన చేయించడంతో ఉత్తీర్ణత శాతం 20 శాతం లోపుగా నిలిచింది. దీంతో మరుసటి సంవత్సరం విద్యార్థుల చేరిక సంఖ్య పెద్దగా లేకపోయింది. ఎంపీసీ, సీఈసీ గ్రూపుల వరకే పరిమితం చేయడంతో ఇతర గ్రూపుల్లో చేరాలనుకున్న విద్యార్థులు ఈ కళాశాలల వైపు చూడకుండా ప్రైవేట్‌బాట పట్టారు. ప్రభుత్వ పాఠశాల నుంచి పదో తరగతి పూర్తి చేసుకుని బయటకు వచ్చినా ఈ కళాశాలల్లో బాలురకు చేరే అవకాశం లేనందున వారు ప్రైవేట్ వైపు వెళ్ళాల్సి వచ్చింది. ఇన్ని విధాలుగా ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు ఆకర్షణగా గత వైసీపీ ప్రభుత్వంలో నిలువలేక పోయాయి. కళాశాలలు పదిలోపు విద్యార్థులతోనే సాగాయి.

### కూటమి ప్రభుత్వం రాకతో..

ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దృష్టి పెట్టింది. ఎడ్యుకేషన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను ఉచితంగా అందించింది. దాతల సహకారంతో విద్యార్థులకు యూనిఫామ్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు మధ్యాహ్న భోజనం పథకం అమలులోకి రానుంది. పాఠశాలల్లో ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రమే నిర్వహిస్తున్నాయి. బైపీసీ, ఒకేషనల్ వంటి గ్రూపులు ఈ కళాశాలల్లో అందుబాటులోకి తెస్తే బాగుంటుంది. ఫ్యాకల్టీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ల్యాబ్‌లను, కంప్యూటర్ సౌకర్యాన్ని తీసుకురావాలి. ఇవన్నీ వచ్చే విద్యా సంవత్సరంలోగా అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే అతి చేరువలోనే ఇంటర్ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులకు చదువుకోవడానికి వీలుగా ఉంటుంది. ప్రస్తుతం ప్రైవేట్ ఇంటర్ విద్యా సంస్థల్లో రెండేళ్లు చదువుకోవాలంటే లక్షకు పైగా సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. గ్రామాల వారీగా అందుబాటులో ఉన్న ఈ ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పల్లెల్లో విద్యార్థులకు ఉపయోగకరంగానే ఏర్పాటు చేసినట్లు అవుతుంది.

### ప్రతిభ కనబరుస్తున్నారు


దిరుసుమర్రు ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరుస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారికి ఉత్తీర్ణత పెంచే దిశగా స్పెషల్ మెటీరియల్ ఇస్తున్నాం. బోధనలో ప్రణాళికగా ముందుకు సాగుతున్నాం. ఉపాధ్యాయులందరూ కలిసి యూనిఫామ్ ఏర్పాటుచేశాం. ఈ ఏడాది టెక్స్ట్, నోట్ బుక్‌లు ప్రభుత్వం అందించడం విద్యార్థులకు సహకారంగా నిలిచింది.

# ఢిల్లీకి సీఎం చంద్రబాబు నాయుడు..

తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సాయంత్రం ఢిల్లీలోని కీలక కార్యక్రమాలకు హాజరవడానికి వెళ్లనున్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు రేపు ఢిల్లీలో జరిగే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం జాతీయ స్థాయిలో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. వాజ్‌పేయ్ రాజకీయ మార్గదర్శకత్వం, దేశభక్తి, వంటి అనేక సేవలను గుర్తు చేసుకునేందుకు ఈ వేడుక నిర్వహిస్తున్నారు.

### అంశాలపై చర్చ..

వాజ్‌పేయ్ శత జయంతి సందర్భంగా ఆయనకు చంద్రబాబు నివాళులర్పించనున్నారు. ఆయన రాజకీయ ఆశయాలను కొనసాగించే క్రమంలో భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలను ఎలా పటిష్టం చేయాలనే అంశంపై చర్చలు జరగనున్నాయి. అయితే 1980 నుంచి 2004 వరకు భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వాజ్‌పేయ్, ఆ సమయంలో బీజేపీని అంతర్జాతీయ



స్థాయిలో నిలబెట్టారని చెప్పవచ్చు. ఆయన నాయకత్వంలో దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.

### ఎన్డీయే కూటమిని

ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిలో భాగమైన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, బీజేపీ నేతలు పాల్గొని, దేశ రాజకీయాలపై సమీక్ష, చర్చలు జరిపే అవకాశం ఉంది. తెలుగు దేశం పార్టీ జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేయడానికి పలు అంశాలను ప్రస్తావించవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సంబంధాల పరంగా కూడా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని చెప్పవచ్చు.

# ప్రభుత్వ సొమ్ము బొక్కేశారు..

### రూ. 2.30 కోట్ల పంచాయతీ సొమ్ము పక్కదారి

### సస్పెన్షన్ కోసం ప్రభుత్వానికి సిఫారసు

### చిన అమిరం పంచాయతీలోనూ దందా

భీమవరం, : పంచాయతీలో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టించిన ఘనుడు అతడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన చెప్పిందే వేదం. కార్యదర్శులుగా ఉంటూ కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన సాగిరాజు కిశోర్ గోపాలకృష్ణంరాజు(కిశోర్ రాజు), బి.జయరాజులపై జిల్లా అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది. పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జాల్లా కలెక్టర్ ఇటీవల ఆదేశాలు జారీచేశారు. నిధులు పక్కదారి పట్టించడంలో వెనుక ఉన్న సూత్రదారులపైనా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భీమవరం రూరల్ మండలం రాయలం పంచాయతీలో వైసీపీ ప్రభుత్వంలో కిశోర్ రాజు, బి.జయరాజులు కార్యదర్శులుగా వ్యవహరించారు. వీరి హయాంలో రూ.2.30 కోట్లు ఆస్తి పన్ను పక్కదారి పట్టింది. ముందుగా జయరాజు కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ తర్వాత కిశోర్ రాజు ఇన్‌ఛార్జ్‌గా కొనసాగారు. కిశోర్ రాజు ఏకంగా రూ. 1.30 కోట్లు తన సొంత అకౌంట్‌లో జమ చేసుకున్నట్టు జిల్లా అధికారుల విచారణలో తేలింది. వీరికి జూనియర్ అసిస్టెంట్ సహకరించారు. ముగ్గురిపైనా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కిశోర్ రాజుపై అరెస్ట్‌వారెంట్ కూడా జారీ అయినట్టు సమాచారం. అవినీతి దందాలో కార్యదర్శి కిశోర్ రాజు ప్రమేయం ఎక్కువగా ఉందని అధికారులు గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏజెన్సీ ప్రాంతానికి ఆయనను బదిలీ చేశారు. పోలవరం నియోజకవర్గంలోని కుక్కునూరు మండలానికి బదిలీపై వెళ్లారు. ఇదే జిల్లాలో ఉండేందుకు కిశోర్‌రాజు చేయని ప్రయత్నం లేదు. అయినా జిల్లా అధికారులు అతని దందాను ముందుగానే పసిగట్టారు. ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేసేశారు. అలాగే పాలకొల్లు ఏరియా హాస్పిటల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంచె మురళి వెంక ట తులసీధర్ (26)ను ప్రభుత్వ నిధులు దుర్వినియోగం, చెక్కుల ఫోర్జరీ కేసులో శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సుమారు రూ. 62లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో



వెల్లడైంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేషెంట్ కేర్ అకౌంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డెవలప్‌మెంట్ సొసైటీ అకౌంట్, పి.ఎఫ్.ఎం.ఎస్ అకౌంట్‌లకు సంబంధించి లావాదేవీల విషయంలో నిధులు దుర్వినియోగం బయటపడింది.

### రాయలం ఆదాయం రూ. కోటి

రాయలం గ్రామ పంచాయతీలో ప్రతిఏటా ఆస్తి పన్ను రూపంలో కోటి రూపాయలు ఆదాయం వస్తుంది. ముందుగా జయరాజు అవతవకలకు తెరతీశారు. ఆ తర్వాత ఇన్‌చార్జిగా వచ్చిన కార్యదర్శి కిశోర్ రాజు అవినీతిని తారాస్థాయికి తీసుకువెళ్లారు. ఆస్తిపన్నును వసూలు చేసి ఏకంగా రూ.1.30 కోట్లు తన సొంత అకౌంట్‌లో వేసుకున్నట్టు అధికారుల విచారణలో తేలింది. అవినీతికి పాల్పడ్డ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని పంచాయతీ రాజ్ కమిషనర్‌కు జిల్లా అధికారులు లేఖ రాశారు.

### పన్ను ఎందుకు కట్టాలి..

రాయలం గ్రామ పంచాయతీ నైసర్గికంగా భీమవరం పట్టణంలో కలిసిపోయింది. అక్కడే అపార్ట్‌మెంట్‌లు వెలు స్తున్నాయి. స్థలాలు ధరలు భీమవరంతో పోటీ పడుతున్నా యి. ప్లాన్‌లకు డిమాండ్ ఉంటోంది. ప్రతిఏటా కోటి రూపాయల ఆస్తి పన్ను వస్తుందంటే పంచాయతీ సామర్థ్యం ఎంతగా ఉందో అర్థమవుతుంది. కార్మదర్శుల అవినీతి భాగో తం తర్వాత పన్ను చెల్లించడానికి ప్రజలు ఎదురుతిరు గుతున్నారు. సొంతంగా సొమ్ములు తినేయడానికా పన్ను చెల్లించాలంటూ ప్రశ్నిస్తున్నారు. రాయలం పంచాయతీలో పన్ను వసూలు చేయడం ఇప్పటి సిబ్బందికి సవాల్‌గా మారింది. పంచాయతీలో గత రికార్డులన్నీ జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు పూర్తి చేశారు.

### దందా అంతా ఇంతా కాదు!

నాటి ఎమ్మెల్యే భరోసా వల్లే కార్యదర్శులు ప్రత్యేకంగా కిశోర్ రాజు బరితెగించారు. చిన అమీరం గ్రామ పంచా యతీకి రెగ్యులర్ కార్యదర్శిగా పనిచేశారు. రాయలం గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జిగా కొనసాగారు. రెండు పంచాయ తీలు భీమవరం పట్టణానికి ఆనుకునే ఉన్నాయి. భీమవరం అంతా ఆ రెండు పంచాయతీల్లో విస్తరించింది. చిన అమి రం గ్రామ పంచాయతీలోనూ కిశోర్‌రాజు దందా అంతా ఇంతా కాదు. అక్రమ లేఅవుట్‌లలో ప్లాన్‌లు తీసుకోకు ండానే ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించారు. వైసీపీ హయాంలో రూరల్ మండల ప్రజాప్రతినిధి చినఅమిరంలో నాన్ అవుట్ వేస్తే జిల్లా పరిషత్ నిధులతో రహదారి వేసేందుకు పూర్తి సహకారం అందించారు. సదరు రహదా రిని స్థల యజమానులు పంచాయతీకి రాసిచ్చారు. పంచా యతీ అనుమతి లేనిదే జిల్లా పరిషత్ నిధులతో రహదారి వేయడానికి వీలులేదు. పంచాయతీ స్థలం కాబట్టి రహదారి వేశామంటూ కార్యదర్శి కిశోర్ రోజు తనను ప్రశ్నించిన వారికి వింత సమాధానం ఇస్తూ వచ్చారు. కానీ అక్కడ నివాసాలు లేవు. అయినా రహదారి వేయడంలో కార్యదర్శి ప్రధాన భూమిక వహించారు. అప్పటి ఎమ్మెల్యే సహకారం వల్లే కార్యదర్శి కిశోర్ రాజు రాయలం, చిన అమిరం పంచాయతీలో పెద్దమొత్తంలో సొమ్ములు కాజేసుకున్నా రన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా చినఅమిరం పంచాయతీలోనూ విచారణ సాగుతోంది. అక్కడ ఎంత నిధులు దుర్వినియోగం అయ్యాయో విచారణ తర్వాత వెల్లడి కానుంది.

# సాగునీటి సంఘాలన్నీ ఏకగ్రీవం

మొత్తం చుట్టేసిన కూటమి

245 డిస్ట్రిబ్యూటరీ, 18 మేజర్,15 మీడియం ప్రాజెక్టు కమిటీలు కైవసం

వైసీపీకి సున్నా.. జగన్ అసహనం

నామినేషన్లు వేయనివ్వలేదని ప్రచారం



అమరావతి, : రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైంది. సాగునీటి సంఘాల సమాఖ్యలన్నిటికీ ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. 2019-24 మధ్య సాగునీటి ప్రాజెక్టులకు జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిర్వహణకు కూడా పైసా ఇవ్వకుండా మొండిచేయి చూపింది. పైగా సాగునీటి సంఘాల ద్వారా 2014-19 మధ్యకాలంలో నీరు చెట్టుకింద చేపట్టిన పనులకు బిల్లులనూ చెల్లించలేదు. ముఖ్యమంత్రిగా జగన్ సాగునీటి సంఘాల పట్ల వ్యవహరించిన తీరుపై రైతులు, రైతు నేతల్లో తీవ్ర ఆగ్రహం గూడుకట్టుకుంది. దీని ఫలితంగానే ఇప్పుడు చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు విజయఢంకా మోగించారు. రాష్ట్రంలోని మేజర్ ప్రాజెక్టుల పరిధిలోని 21,060, మీడియం ప్రాజెక్టుల పరిధిలో 3,192, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని 21,768.. మొత్తంగా 49,020 టెరిటోరియల్ కమిటీలకు జరిగిన ఎన్నికలు వాటికి ఏకపక్షమయ్యాయి. అదేవిధంగా మేజర్ ప్రాజెక్టుల పరిధిలోని 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 18 మేజర్ ప్రాజెక్టు కమిటీలు, మీడియం ప్రాజెక్టుల పరిధిలోని 15 కమిటీలు కూటమి వశమయ్యాయి. వైసీపీకి ఒక్కటి కూడా దక్కలేదు. చివరకు జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల సహా... కడప జిల్లాలోనూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి వైసీపీ నాయకులెవరూ ముందుకు రాలేదు. తమ నామినేషన్లను సాంకేతిక కారణాలను చూపి తిరస్కరించారంటూ కొందరు నేతలు ఆరోపణలు చేస్తున్నా.. వాస్తవానికి చాలా మంది కావాలనే నామినేషన్లలో పూర్తి సమాచారాన్ని ఇవ్వలేదని తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను పులివెందుల సహా 11 స్థానాలకే వైసీపీ పరిమితం కావడంతో ఆ పార్టీ నేతలు, శ్రేణులు పరాజయ భారం నుంచి ఇప్పటికీ బయటపడలేదు. అందుకే నీటి సంఘాల ఎన్నికలపై ఆసక్తి చూపలేదు. దీనిని మరుగుపరచి.. తమ వారిని నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని జగన్ ప్రచారం చేస్తున్నారు. అయితే సాగునీటి ఎన్నికల్లో ఎంతమంది వైసీపీ నేతలు నామినేషన్లు వేసేందుకు సిద్ధపడ్డారో ఆయన వెల్లడించాలని కూటమి పార్టీలు సవాల్ విసురుతున్నాయి. ఆయన అధికారంలో ఉన్నప్పుడు జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్షాలను నామినేషన్లు వేయనివ్వకపోవడం, వేసినా దొంగ సంతకాలతో ఉపసంహరణలు, అపహరణలు, దౌర్జన్యాలు, బెదిరింపులతో వాటిని కైవసం చేసుకున్న సంగతి గుర్తుచేస్తున్నాయి. కాగా.. ఎన్నికలు ఏకగ్రీవంగా ముగియడంతో ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణపై కమిటీలు దృష్టి సారించాయి ప్రధానమైన శ్రీశైలం, నాగార్జున సాగర్, ధవళేశ్వరం వంటి మేజర్ ప్రాజెక్టులతో పాటు మధ్యతరహా చిన్నతరహా నీటి వనరుల అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి.

# రాజధాని పనులు చకచకా!

మొదలైన శాశ్వత సచివాలయ పనులు

భారీ మోటర్లతో నీటిని తోడుతున్న అధికారులు

ఐదేళ్లపాటు నీటిలో నానబెట్టిన జగన్ ప్రభుత్వం



గుంటూరు, : నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాల శాశ్వత భవనాల పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి నిధులు విడుదల కావడంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. 2019 ఎన్నికలకు ముందు ఆగిపోయిన రాష్ట్ర సచివాలయం శాశ్వత భవన సముదాయ నిర్మాణ పనులు తిరిగి మొదలు పెట్టేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతుండగా, అది పూర్తయ్యేలోగా నిలిచి ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. రాష్ట్ర సచివాలయ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని భావించిన అప్పటి టీడీపీ ప్రభుత్వం 40 నుంచి 50 అంతస్తులు ఉండేలా 5 భవనాల (టవర్ల) సముదాయాన్ని నిర్మించాలని భావించింది. సీఎం చంద్రబాబు 2018 డిసెంబరు 27న నిర్మాణ పనులను ప్రారంభించారు. అత్యంత ఎత్తయిన ఐదు టవర్లతో డయా (రెండు వరుసల) గ్రిడ్ విధానంలో వాటిని నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. అసెంబ్లీ భవన ప్రాంగణంలో 69.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాటి నిర్మాణానికి రూ.4,890 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మళ్లీ ఆరేళ్ల తర్వాత సరిగ్గా అదే సమయానికి ఇప్పుడు ముందస్తు పనులు మొదలు పెడుతుండటం విశేషం. ర్యాఫ్ట్ ఫౌండేషన్ రికార్డు: భారీ భవనాలకు కీలకమైన పునాదుల నిర్మాణాన్ని కీలకంగా తీసుకున్న ప్రభుత్వం అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. నిర్మాణ సంస్థ అయిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) మూడు రోజుల్లో, అంటే 72 గంటల్లో 10,816 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాన్ని 66 గంటల్లోనే పూర్తిచేశారు. ఒక కార్యాలయం కోసం దేశంలో నిర్మించిన అతిపెద్ద రాఫ్ట్‌గా సచివాలయ పునాదులు రికార్డులకెక్కాయి. డిసెంబరు 29న మొదలైన ర్యాఫ్ట్ నిర్మాణం 66 గంటలు నిర్విరామంగా సాగి డిసెంబరు 31కి పూర్తయింది. 13 అడుగుల లోతులో వేసిన ఈ ర్యాఫ్ట్ ఫౌండేషన్‌కు ప్రపంచ ప్రఖ్యాత ఫోస్టర్ అండ్ పార్టనర్ సంస్థ ప్రణాళిక రూపొందించింది. షాపూర్జీ- పల్లోంజి సంస్థ ఆ రికార్డును సాధించింది. అంతటి నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం నీటిపాలు చేసింది. జగన్ నిర్వాకంతో నీటిపాలైన సచివాలయ భవన సముదాయ పునాదుల పటిష్ఠతపై తాజాగా కూటమి ప్రభుత్వం అధ్యయనం చేయించింది. ఐఐటీ హైదరాబాద్ బృందం ఈ ఏడాది ఆగస్టులో నీటి లోపల ఉన్న పునాదులను పరిశీలించి. పునాదులకు ఎటువంటి ఢోకా లేదని, తదుపరి నిర్మాణానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని నివేదికలో పేర్కొంది. దీంతో సచివాలయ టవర్ల పునాదులను మింగేసిన నీటిని తొలగించే పనులను అధికారులు బుధవారం ప్రారంభించారు. మూడు ట్రాక్టర్ల ఇంజన్లతో భారీ మోటర్లను అనుసంధానించి నీటిని తోడుతున్నారు. ఆ నీటిని పాలవాగులో కలుపుతున్నారు. అక్కడినుంచి కృష్ణానదిలోకి వదిలేస్తారు.

# జనవరి నుంచి ప్రారంభించాలనే యోచన

## ఇప్పటికే వేతనాల మానిటరింగ్ సెల్ ఏర్పాటు

అమరావతి, : ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే సిబ్బందికి శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాల్సిన అవసరముందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు భావిస్తున్నారు. జనవరి నుంచి సిబ్బందికి పనుల నిర్వహణపై నిపుణులతో శిక్షణ ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల విషయంలో కూడా మార్పులు చేర్పులు చేపట్టనున్నారు. ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఉపాధి పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. పలు చోట్ల కూలీలకు రూ.150ల నుంచి రూ.190 వరకు వేతనాలు మాత్రమే అందుతుండటం, కొన్ని చోట్ల పనులు లేకుండానే జరిగినట్లు మస్టర్లు వేయడం తదితర అంశాలను గమనించారు. గత ఐదేళ్లుగా ఉపాధి పథకం గాడితప్పడంతో సిబ్బంది కూడా పథకం లక్ష్యం విస్మరించారని, వారికి తిరిగి శిక్షణ ఇవ్వడం ద్వారా పథకాన్ని గాడిన పెట్టాలని నిర్ణయించారు. గతంలో ఉపాధి పథకం ద్వారా ఏటా మేట్లకు, కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, మండలస్థాయి సిబ్బందితో పాటు అన్ని స్థాయిల్లో శిక్షణ ఇచ్చేవారు. ఈ ఐదేళ్లూఎక్కడా అలాంటి శిక్షణలు నిర్వహించలేదు. దీంతో పాటు గతంలో శిక్షణ పొందిన ఫీల్డ్ అసిస్టెంట్లను రకరకాల కారణాలతో తొలగించడంతో, మిగిలిన సిబ్బందికి ఈ పథకం అవగాహన లేక పనుల స్ఫూర్తి దెబ్బతిందన్న అభిప్రాయం ఏర్పడింది.

మళ్లీ శ్రమశక్తి సంఘాలు

గతంలో శ్రమశక్తి సంఘాలు(ఎసఎసఎస)గా 20 నుంచి 40 మంది కూలీలతో గ్రూపులు ఏర్పాటుచేసి వాటికి మేట్‌లను నియమించేవారు. ఆ మేట్‌లకు ప్రతి ఏడాదీ శిక్షణ అందించేవారు. ఆయా గ్రూపులుగా కొన్ని నిర్దిష్టమైన పనులు నిర్వహించేవారు. దీంతోపాటు పనుల కోసం కూలీలను తీసుకొచ్చేవారు. మేట్‌లందరూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయకారిగా ఉండటంతో పథకం సజావుగా, పారదర్శకంగా సాగేది. గత ఐదేళ్లు ఈ మేట్‌లకు ట్రైనింగ్ ఇవ్వకపోవడమే కాకుండా శ్రమశక్తి సంఘాలు కూడా కనుమరుగయ్యాయి. ఇప్పుడు ఉపాధి పనులు సక్రమంగా జరగడానికి, కూలీలకు రూ.300లు వేతనం అందడానికి సిబ్బందితో పాటు శ్రమశక్తి సంఘాలను తిరిగి అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అంతే కాకుండా మండలస్థాయి సిబ్బందికి కూడా మారుతున్న కాలాన్ని బట్టి వారి జాబ్‌చార్ట్‌పై శిక్షణ ద్వారా సరైన అవగాహన కల్పించాలని భావిస్తున్నారు.

# బీపీసీఎల్‌తో కలిసి భారీ రిఫైనరీకి రెడీ!

రామాయపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ - పెట్రో కాంప్లెక్స్

జాయింట్ వెంచర్ కింద నెలకొల్పేందుకు సుముఖత

గ్రీన్‌ఫీల్డ్ విధానాలపై 'సౌదీ అరాంకో' ఆసక్తి

ప్రపంచ అగ్రగామి చమురు ఉత్పాదక సంస్థ ఇది

మహారాష్ట్ర, యూపీలను కాదని ఏపీ వైపు మొగ్గు

ప్రాజెక్టు కోసం పలుదఫాలు ఢిల్లీకి బాబు

బీపీసీఎల్, కేంద్ర పెద్దలతో విస్తృత చర్చలు

ఎట్టకేలకు రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు

మోదీ సౌదీ పర్యటనలో ప్రస్తావించే వీలు

త్వరలో దావోస్‌లో సౌదీ బృందంతో బాబు భేటీ!




ఆంధ్రప్రదేశ్‌లోకి చమురు రంగం నుంచి భారీ పెట్టుబడులు తరలి రానున్నాయి. దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చేందుకు ప్రపంచ అగ్రగామి చమురు ఉత్పాదక సంస్థ 'సౌదీ అరాంకో' ఆసక్తితో ఉంది. భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో (బీపీసీఎల్) కలిసి ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ కం పెట్రో కాంప్లెక్స్ నిర్మాణానికి మొగ్గు చూపుతోంది. నిజానికి ఈ మెగా ఆఫర్‌ను అందుకోవడానికి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ప్రయత్నించినా.. చివరకు ఏపీ దానిని దక్కించుకోవడం విశేషం. నిజానికి, ఆ రెండు రాష్ట్రాల్లో యూపీ బీజేపీ పాలిత రాష్ట్రం. అయినా.. కేంద్ర చమురు సంస్థ బీపీసీఎల్ ఏపీ వైపే మొగ్గింది. రామాయపట్నంలో 10 లేదా 12 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో 'సౌదీ అరాంకో'తో జాయింట్ వెంచర్ కింద నిర్మించేందుకు సిద్ధమైంది. 'ఇది నిజంగా అద్భుతమే'ననే వ్యాఖ్యలు పారిశ్రామిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అయితే, ఈ అద్భుతాన్ని సాకారం చేయడంలో కొన్ని అంశాలు కీలకంగా పనిచేశాయని చెబుతున్నారు.

## గ్రీన్‌ఫీల్డ్‌పై సౌదీ మక్కువ!

రిఫైనరీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన నెల్లూరు జిల్లా రామాయపట్నం, శ్రీకాకుళం జిల్లా మూలపేట, కృష్ణా జిల్లా మచిలీపట్నం.. ఇలా మూడూ గ్రీన్ ఫీల్డ్ రేవు కేంద్రాలే. చంద్రబాబు స్వతహాగానే గ్రీన్‌ఫీల్డ్ విధానానికి గట్టి మద్దతుదారు. రాజధాని అమరావతి నిర్మాణం మొదలు భోగాపురం విమానాశ్రయంఏర్పాటు వరకు ఆయన ప్రభుత్వం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. మరోవైపు.. సౌదీ అరేబియా గ్రీన్ ఫీల్డ్ విధానానికి పెద్దపీట వేస్తోంది. 'సౌదీ అరాంకో' ప్రతినిధులతో భారత అధికారులు జరిపిన చర్చల్లో ఈ అంశం ప్రముఖంగా పరిశీలనకు వచ్చినట్టు సమాచారం. ఇదే అంశం ఏపీకి బాగా కలిసి వచ్చిందని చెబుతున్నారు.

## మెప్పించిన బాబు హుందాతనం

బీపీసీఎల్‌తో జరిపిన పలు సంప్రదింపుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలను సీఎం చంద్రబాబు రిఫైనరీ కోసం సూచించారు. బందరు అయితే బాగుంటుంది అని ఆయన ప్రతిపాదించారు. కానీ, అక్కడే కావాలి.. అని స్థలం విషయంలో పట్టుబట్టలేదు. వచ్చేది ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు. అది ఏపీకి రావడమే ముఖ్యం అన్నట్టు చంద్రబాబు వ్యవహరించారు. ఆయన ప్రదర్శించిన హుందాతనం కేంద్ర మంత్రులు, ఆయా మంత్రిత్వ శాఖలను బాగా ఆకట్టుకున్నదని చెబుతున్నారు. కాగా, దావోస్‌లో త్వరలో జరిగే పెట్టుబడుల సదస్సులో చంద్రబాబు.. సౌదీ అరేబియా. ఇతర గల్ఫ్ నేతలతో ఈ దిశగా సమావేశం కానున్నారని తెలుస్తోంది.

## కలిసొచ్చిన కేంద్రం సహకారం..

మహారాష్ట్రలోని రత్నగిరిని గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏర్పాటుకు తొలుత పరిశీలించారు. మరాఠా నాయకుల మధ్య గొడవల కారణంగా బీపీసీఎల్ వెనక్కి తగ్గింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్) పేరు తెరపైకి వచ్చింది. బీజేపీ పాలిత రాష్ట్రం కావడంతో దాదాపు అక్కడే రిఫైనరీ ఏర్పాటవుతుందని అంతా భావించారు. కారణం తెలియదుగానీ, కేంద్ర ప్రభుత్వమే అక్కడ నెలకొల్పేందుకు ఇష్టపడలేదు. మరోవైపు ఈ ప్రాజెక్టు కోసం చంద్రబాబు పలు సార్లు ఢిల్లీలో పర్యటించారు. ఈ క్రమంలో రిఫైనరీ గురించి భారతీయ అధికారులు అటు 'సౌదీ అరాంకో'తోను, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబుతోను పలుదఫాలు చర్చలు జరిపారు. మోదీ కేబినెట్‌లో కీలక మంత్రులు పీయూశ్ గోయల్, హర్దీప్ సింగ్ పూరీ, ఎస్ జైశంకర్‌లు ఏపీకి ఈ ప్రాజెక్టు ఇవ్వడానికి పూర్తి సానుకూలత వ్యక్తం చేసినట్టు సమాచారం. పీయూశ్ గోయల్ ఇప్పటికే పలుసార్లు సౌదీ అరేబియాకు వెళ్లి అధికారులతో చర్చలు జరిపారు. త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ కూడ సౌదీ నాయకత్వంతో సమావేశం కానున్నారని, అందులో దీనికి సంబంధించి ఒక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

## ఇది రెండో రిఫైనరీ!

రాష్ట్రంలో తొలి రిఫైనరీ విశాఖపట్నంలో ఏర్పాటైంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అమెరికాకు చెందిన సంస్థ దీనిని ఏర్పాటుచేసింది. జాతీయీకరణలో భాగంగా ఈ రిఫైనరీ హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ కార్పొరేషన్ యాజమాన్యం కిందకు వెళ్లింది. రామాయపట్నంలో ఇప్పుడు ఏర్పాటు చేసేది రెండో రిఫైనరీ అవుతుంది. బీపీసీఎల్ భారతదేశంలో ఇప్పటికే మూడు రిఫైనరీలను నిర్వహిస్తోంది. రామాయపట్నంలో తలపెట్టింది ఈ వరుసలో నాలుగోది కానుంది.

## అందుకే.. ఆంధ్రా!


ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత భారత్‌కు రష్యా చమురు ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. యుద్ధం కారణంగా భరించాల్సి వస్తున్న ఆర్థిక నష్టాలనుంచి, అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న ఆంక్షల నుంచి బయటపడేందుకు భారీ రాయితీలతో మనకు చమురు ఉత్పత్తులను రష్యా ఎగుమతి చేస్తోంది. సౌదీ అరేబియాను దాటుకుని మరీ మన చమురు మార్కెట్‌లోకి రష్యా దూసుకొచ్చింది. దీంతో అనివార్యంగా భారత్‌పై సౌదీ అరేబియా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశం గుండా ఆగ్నేయాసియా దేశాలకు చమురు సరఫరా చేయడానికి దీర్ఘకాలిక వ్యూహాలను సిద్ధం చేసుకొంటోంది. ఈ క్రమంలో బంగాళాఖాత తీరంలోని ఆంధ్రా తీరం అనువైన ప్రాంతంగా కనిపించింది. అందువల్లే.. చర్చల్లో భాగంగా భారతీయ అధికారులు.. ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన తీసుకురాగా, 'సౌదీ అరాంకో' సానుకూలంగా స్పందించినట్టు సమాచారం.

# ప్రధానితో భేటీ ఫలవంతం

ప్రధాని మోదీతో సమావేశం ఫలప్రదంగా జరిగింది. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను తిరిగి గాడిలో పెట్టేందుకు చేసిన సాయానికి ధన్యవాదాలు తెలియజేశాను. గత ప్రభుత్వం 94 కేంద్ర పథకాల నిధులు దారిమళ్లించడాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లాను. వీటిని మళ్లీ ప్రారంభించడానికి మా ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించాను. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను, కేంద్రం సాయం చేయాల్సిన అవసరాన్ని తెలియజేశాను. రాష్ట్ర పర్యటనకు రానున్న ఆయనకు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నాను.

## అమిత్‌షా, నిర్మల, నడ్డా, కుమారస్వామి, అశ్వినీ వైష్ణవ్‌తో వేర్వేరుగా భేటీ

న్యూఢిల్లీ, : స్వర్ణాంధ్ర విజన్-2047ను సాకారం చేసేందుకు అన్ని విధాలా సాయం అందించాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. ఐదేళ్లలో రావలసిన రెవెన్యూ లోటు గ్రాంటును మూడేళ్లలోనే వాడేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా... తమ వంతుగా రాష్ట్రప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను, వాటిని చేరుకునేందుకు సిద్ధం చేసిన ప్రణాళికలను, ఆలోచనలను ప్రధానికివివరించారు. వచ్చే నెలలో మోదీ చేతుల మీదుగా రాష్ట్రంలో భారీగా తలపెట్టిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం ప్రధానితో ఆయన నివాసంలో చంద్రబాబు భేటీ అయ్యారు. 45 నిమిషాలు ఇది సాగింది. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, ఆర్థిక అంశాలపై చర్చించారు. ఇటీవల విడుదల చేసిన స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రధానికి అందజేశారు. పోలవరం, అమరావతి పనులు మళ్లీ ప్రారంభించిన విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పనులు వేగంగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏపీకి కీలకమైన రెండు ప్రాజెక్టులను గాడిన పెట్టడానికి ఆర్థిక సాయం చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. 94 కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించిన విషయాన్ని.. దానివల్ల జరిగిన నష్టాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 74 కేంద్ర పథకాలను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాన్ని ప్రధానికి వివరించిన సీఎం.. ఆ ప్రాజెక్టుకు అవసరమైన ముడి ఖనిజం సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. దీంతో పాటు ఈ సంస్థ ఏర్పాటుకు వివిధ శాఖలకు సంబంధించి అనుమతులు త్వరితగతిన వచ్చేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. సాంకేతిక ఇబ్బందులు తొలగితే ప్రాజెక్టు వేగంగా పట్టాలు ఎక్కుతుందని.



అందుకు సహకరించాలని అభ్యర్థించారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వాటిని గాడిన పెట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర నిధుల విడుదలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పట్టుకుని ప్రత్యేక సాయం చేయాలని కోరారు.

## పలువురు మంత్రులతో సమావేశం..

ప్రధానితో భేటీకి ముందు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో తన అధికారిక నివాసంలో చంద్రబాబు సమావేశమయ్యారు. విశాఖ రైల్వే జోన్ పనుల శంకుస్థాపన, రాష్ట్రంలో చేపట్టిన, చేపట్టనున్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే అంశంపై చర్చించారు. అమరావతికి కొత్త రైల్వే లైన్ మంజూరు చేసినందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఉదయం మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన చంద్రబాబు.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్డీయే పక్షాల భేటీలో పాల్గొన్నారు. సమావేశనంతరం అమిత్‌షా, నడ్డాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, తదుపరి కార్యచరణపై చర్చించారు. సీఎం పర్యటనలో ఆయన వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్ ఉన్నారు.

## కీలక ప్రాజెక్టులపై చర్చ

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన అత్యవసర సహకారం, రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై ప్రధానితో సీఎం చర్చించినట్లు పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు. రైల్వేజోన్ స్థాపన, వాల్తేర్ రైల్వే డివిజన్ పురోగతి, ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే కనెక్టివిటీ, అభివృద్ధిని పెంచే లక్ష్యంతో కొత్త మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వంటి కార్యక్రమాలపై రైల్వే మంత్రితో చర్చించారని తెలిపారు.

## నేడు హైదరాబాద్‌కు చంద్రబాబు

చంద్రబాబు గురువారం ఉదయం ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్తారు. అక్కడ కొన్ని ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం అమరావతికి తిరిగివస్తారు.

## వాజపేయికి సీఎం ఘననివాళి

న్యూఢిల్లీ, : భారతజాతి గర్వించదగిన నేత వాజపేయి అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనియాడారు. వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఉదయం వాజపేయి సమాధి 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి సీఎం చంద్రబాబు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నేషన్ ఫస్ట్' అని ఎప్పుడూ భావించే వాజపేయితో కలిసి పనిచేసిన అనుభూతి తనకు చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. దేశం గురించి వాజ్‌పేయి ఆలోచించే తీరు విలక్షణమైనదని, దానికి ఆధునికత, సాంకేతికత జోడించాలని తాను సూచించినప్పుడు, సంస్కరణల గురించి ప్రతిపాదనలు చేసినప్పుడు ఆయన స్పందించిన తీరును ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. వాజపేయితో తాను దిగిన ఫొటోను చంద్రబాబు పంచుకున్నారు.

# ఆర్టీసీలో ఎండీ నుంచి డీఎం వరకూ ఇన్‌చార్జిలే దిక్కు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి రథచక్రం దారి తప్పింది! డ్రైవర్ లేని బస్సు తరహాలో గమ్యంలేని ప్రయాణం చేస్తోంది!! కదల్లేని స్థితిలో డిపోల నుంచి బయటికి రాలేక బస్సులు ఆపసోపాలు పడుతున్నాయి. కొత్త బస్సులు వస్తున్నాయని చెబుతున్న యాజమాన్యం అవి ఎప్పటికి వస్తాయో చెప్పలేకపోతోంది. అసలు ఆర్టీసీలో ప్రయాణికుల సౌకర్యాల గురించి ఆలోచించే అధికారులే కరువయ్యారు. సంస్థల్లో డిపో మేనేజర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వరకూ ఇన్‌చార్జిలే.. ఆఖరికి సంస్థ ఎండీ కూడా ఆర్నెళ్లుగా ఇన్‌చార్జే!! దీంతో పండగ ప్రయాణికుల బస్సులే కాదు.. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు పైనా పూర్తిస్థాయి కసరత్తు జరగలేదు. ప్రభుత్వంలో విలీనం తర్వాత అన్నీ బాగుంటాయనుకుంటే సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడింది. ఆర్టీసీని ప్రయాణికులు ఆదరిస్తున్నా సేవలు అందించడంలో వారిని సంతృప్తి పరచలేక పోతోందన్న విమర్శలు మూటగట్టుకుంటోంది.

## పూర్తిస్థాయి అధికారులు లేక..

రాష్ట్రంలో 11,500 బస్సులతో ప్రతి రోజూ 45లక్షల మేర తిరుగుతూ 65లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చే అతిపెద్ద రవాణా సంస్థ ఆర్టీసీ రోజురోజుకూ ప్రయాణికులకు దూరమవుతోంది. లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేర్చే ప్రభుత్వ రంగ ప్రయాణ సంస్థ సక్రమంగా నడవాలంటే డ్రైవర్ లాంటి ఎండీ ముందుగా కష్టపడాలి. ఆర్నెళ్ల క్రితం డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమల రావు.. వారానికి ఒక రోజు కూడా ఆర్టీసీ వైపు చూడట్లేదు. ఆయనకు రాష్ట్రంలోని శాంతి భద్రతల సమస్యలపై దృష్టి సారించడానికే సమయం సరిపోవడంలేదు. ఆయన తర్వాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంస్థను సజావుగా నడిపించాలి. ఈడీ అడ్మిన్, ఈడీ ఆపరేషన్స్ ఆర్టీసీ హౌస్‌కు వచ్చి కొన్ని నెలలు అవుతోంది. అనుభవం తక్కువగా ఉన్న వారికి సరైన సూచనలు చేసేవారూ లేరు. ఉత్తరాంధ్ర ఈడీ విజయ్ కుమార్, విజయవాడ ఈడీ విజయరత్నం, కడప ఈడీ చంద్రశేఖర్ ఇన్‌చార్జిలే. నెల్లూరు తప్ప రెగ్యులర్ ఈడీలు లేకుండా వ్యవస్థను నడిపిస్తున్న ఆర్టీసీకి అసలు ఈడీల వ్యవస్థ ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది. పోనీ రీజినల్ మేనేజర్లయినా ఉన్నారా? అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరుతోపాటు తిరుపతి, నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం లాంటి చోట్ల కూడా ఆర్ఎంలు లేరు. కీలకమైన ప్రాంతాల్లో ఇన్‌చార్జిలతోనే బండి నడిపిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం.. కనీసం 40డిపోల్లో డీఎంలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిందంటే ఎంత దుస్థితిలో ఉందో అర్థమవుతోంది. డిపో మేనేజర్‌కు పని ఎక్కువగా ఉంటుంది. అటువంటి పోస్టుల్లోనూ ఇన్‌చార్జిలను నియమిస్తే ప్రయాణికులకు సేవ చేయడం సాధ్యమేనా? అని ఆర్టీసీ హౌస్‌లోనే ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.


## ఆర్టీసీ హౌస్‌లో ఇలా..

ఇక ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో పరిస్థితి మరీ అధ్వానం. పదేళ్లకు పైగా ఉద్యోగులు ఇక్కడే తిష్ఠ వేసుకు కూర్చున్నారు. వారిని బదిలీ చేసి అక్కడికి ఇంకొకరిని తీసుకొచ్చే ఆలోచన కూడా ఉన్నతాధికారులు లేరు. అటు విజయనగరంలో పనిచేసే ఉద్యోగులంతా విశాఖపట్నం నుంచే తిరుగుతున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైన తర్వాత సిబ్బందిలోనూ అలసత్వం ఎక్కువైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎక్కడ ఆగిపోతాయో తెలియని డొక్కు బస్సులు.. ఏది అడిగినా పట్టించుకోని సిబ్బంది.. వారిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఇన్‌చార్జిలు కావడం, పూర్తిస్థాయిలో పట్టులేకపోవడం.. ఫలితంగా ఆక్యుపెన్సీ రేషియో తగ్గిపోతోంది. ఎక్కడి కక్కడ ఓల్వో బస్సులు ఆగిపోతుండటంతో ఆర్టీసీలో ప్రయాణమంటేనే ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు.

## డ్రైవర్ లేరని బస్సు సర్వీసు రద్దు!

ఆర్టీసీ చైర్మన్ సొంత జిల్లాలో డ్రైవర్ లేక ఇటీవల శ్రీశైలం బస్సు సర్వీసును రద్దు చేశారు. మరొకరిని ఏర్పాటు చేయలేకపోయిన అక్కడి డీఎం.. ప్రయాణికులకు రిజర్వేషన్ డబ్బులు వాపసు చెల్లించారు. ఆ సమయంలో మరో ప్రైవేటు వాహనాల్లో వెళ్లలేక, ప్రయాణం రద్దు చేసుకోలేక ఇబ్బంది పడ్డవారు సోషల్ మీడియాలో ఆర్టీసీ సేవల్ని ఏకిపారేశారు. ఇలాంటివి ఆక్యుపెన్సీపై తీవ్ర ప్రభావం చూపుతాయి. డ్రైవర్ల కొరత ఉందని చెబుతోన్న యాజమాన్యం నియామకాలు చేసుకోదు. ఉన్న డ్రైవర్లకు అనారోగ్యమంటూ కొందరు అసోసియేషన్ల నేతలు 'స్వలాభం' కోసం ఓడీలు ఇప్పించే పనిలోనే ఉంటారు. ఆఖరికి ఆర్టీసీ సెక్యూరిటీ అధికారి కూడా డీజీపీ కార్యాలయంలో ఉంటారు. ఆర్టీసీ హౌస్‌లో విధులు నిర్వర్తించాల్సిన ఆయనకు అక్కడేంపని అని అడిగేవారు కూడా లేరు. విజిలెన్స్ విభాగం ఎంతమేర నిఘా పెట్టింది.. ఎంతమందిపై చర్యలు తీసుకున్నారని అడిగితే అసలు ఐపీఎస్ అధికారి లేక ఎన్నిసంవత్సరాలైందో అనే సమాధానం వస్తోంది. విజిలెన్స్ నివేదికపై చర్య తీసుకోవాల్సిన ఈడీ పరిధిలో ఆ విభాగం పని చేయడం మరో వింత. కొత్త సంవత్సరంలో అయినా కొత్త బస్సులు, అవసరమైన సేవలు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# బెళగావి దోవ చూపుతుందా?



ఎన్నికలొచ్చినప్పుడల్లా భంగపాటు రివాజైన కాంగ్రెస్‌కు ఈసారి ఢిల్లీ ఎన్నికలకు రెండు నెలల ముందే అవమానం ఎదురైంది. 'ఇండియా' కూటమి నుంచి ఆ పార్టీని తక్షణం సాగనంపాలని ఆప్ పిలుపునివ్వటం వర్తమాన రాజకీయాల్లో కాంగ్రెస్ దయనీయస్థితిని వెల్లడిస్తోంది. వాస్తవానికి పార్టీ అధ్యక్ష హోదాలో గాంధీ మహాత్ముడు బెల్గాం (ప్రస్తుతం బెళగావి) కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గురువారంనాడు రెండురోజుల శత వార్షిక వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశాలు జరుగు తున్నాయి. సైద్ధాంతిక వైరుధ్యాలతో పరస్పరం కలహించుకునే పక్షాలు ఒక దరి చేరి కూటమిగా చెప్పుకున్నంత మాత్రాన అవి కలిసి కాపురం చేస్తాయన్న నమ్మకం ఎవరికీ ఉండదు. అందువల్లేఇండియా కూటమికి ప్రారంభంలోనే పగుళ్లొచ్చాయి. కూటమిలో ఉంటాను గానీ బెంగాల్ వరకూ ఎవరికీ ఒక్కటంటే ఒక్క సీటివ్వనని తొలుతే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెగేసి చెప్పారు. అనంతరకాలంలో ఆమె దూరం జరిగారు. ఢిల్లీ వరకూ ఆప్ సైతం ఇంచుమించు అదే వైఖరి తీసుకుంది. పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుకు అంగీకరించినా ఈ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు వెళ్తామన్నది. ఆప్, కాంగ్రెస్ పార్టీలు రెండూ అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. ఈలోగా ఆప్‌పై రాజకీయంగా పైచేయి సాధించటం కోసం కాంగ్రెస్ విరుచుకుపడుతోంది. తాము గెలిస్తే మహిళా సమ్మాన్ పేరుతో ఇప్పటికే ఇస్తున్న రూ. 1,000ని రూ. 2,100కు పెంచుతామని ఆప్ వాగ్దానం చేయడాన్ని కాంగ్రెస్ ప్రధానంగా తప్పుబడుతోంది. ఆప్ ఇస్తున్న సంక్షేమ హామీలు ప్రజలను మోసగించడమేనని, ఇది శిక్షార్హమైన నేరమని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై, ముఖ్యమంత్రి అతిశిపై కాంగ్రెస్ కేసులు పెట్టింది. ఆయన్ను జాతి వ్యతిరేకిగా అభివర్ణించింది. ఆప్ వైఫల్యాలపై శ్వేతపత్రం కూడా విడుదల చేసింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేసినా ఇంతగా వైషమ్యాలు లేవు. బెళగావి సమావేశాల్లో కాంగ్రెస్ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేయాలని పార్టీ భావిస్తోంది. అయితే దేనిపైనా తనకంటూ స్పష్టమైన వైఖరి లేకుండా గాలివాటుకు కొట్టుకుపోయే విధానాలను అవలంబించినంత కాలమూ ఇలాంటి కార్యాచరణలు ఎంతవరకూ సత్ఫలితాలిస్తాయన్నది సందే హమే. ఆర్నెల్లక్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుపెట్టుకున్న ఆప్‌పై ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం హఠాత్తుగా స్వరం మార్చి విమర్శలు లంకించుకోవటం వెనకున్న అంత రార్థాన్ని జనం గ్రహించలేరని కాంగ్రెస్ భావిస్తున్నదా అన్న సందేహం వస్తుంది. ఢిల్లీని వరసగా మూడు దఫాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ అక్కడ తనకెదురవుతున్న చేదు అనుభవాలకు కారణ మేమిటో లోతైన అధ్యయనం చేస్తే ఎంతో కొంత ఫలితం ఉంటుంది. దానికి బదులు బీజేపీ మాదిరే ఆప్‌పై విమర్శలు చేస్తే చాలన్నట్టు కాంగ్రెస్ పోకడ ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఢిల్లీ కాంగ్రెస్ హెచ్‌కేఎల్ భగత్, జగదీష్ టైట్లర్ గ్రూపులుగా విడిపోయి అంతర్గత కలహాలతో సతమతమవుతున్న తరుణంలో దాదాపు బయటి వ్యక్తిగా ముద్రపడిన షీలా దీక్షిత్‌కు ఢిల్లీ పీసీసీ చీఫ్ పదవి అప్పగించారు. ఆ తర్వాతే అక్కడ కాంగ్రెస్ గట్టెక్కింది. ఇప్పుడు ఆ మాదిరి వ్యూహం ఉన్నట్టు కనబడదు. ఈసారి మౌలికస్థాయిలో పార్టీ పునర్నిర్మాణానికి నడుం బిగించామని, ఢిల్లీలో తమకు మంచిస్పందన ఉన్నదని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. అదే నిజమైతే బస్తీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, ముఖ్యంగా కాలుష్యంపై ఆ పార్టీ దృష్టి సారించాలి. పార్టీ అంతర్గత నిర్మాణం చక్క దిద్దుకోవాలి. కానీ జరుగుతున్నది వేరు. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ పొరపాటే చేసింది. ఆ ఎన్నికల్లో ఆప్%-%కాంగ్రెస్ పొత్తు మెరుగైన ఫలితాలనిస్తుందని అందరూ భావించారు. కానీ అప్పటి పీసీసీ అధ్యక్షుడు అరవింద్ సింగ్ లవ్‌లీతోసహా కీలక నేతలు పార్టీ విజయావకాశాలను దెబ్బ తీశారన్నది విశ్లేషకుల అంచనా. అరవింద్ సింగ్ ఇప్పుడు బీజేపీలో చేరారు. పేరుకు ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్నా భాగస్వామ్య పక్షాల నుంచి కాంగ్రెస్‌కు సూటిపోటి మాటలు తప్పడం లేదు. ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ, ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పక్షాలు కాంగ్రెస్ సామర్థ్యంపై సందేహం వ్యక్తం చేస్తున్నాయి. వీరితో ఆప్ సైతం గొంతు కలపటం కాంగ్రెస్ దయనీయ స్థితిని తెలియజేస్తున్నాయి. కార్యాచరణ మాట అటుంచి ముందు మిత్రులతో కలిసి ప్రయాణించలేని పరిస్థితులు ఎందుకేర్పడ్డాయో ఆత్మవిమర్శ చేసుకో వాల్సిన అవసరం కనబడుతోంది. క విపక్షంగా ఎటూ సమస్యలు వచ్చిపడుతుంటాయి. కానీ తెచ్చిపెట్టుకుంటున్న సమస్యలు కోకొల్లలని ఆ పార్టీ గ్రహించలేకపోతున్నది. ఎంతసేపూ పార్టీ వైఫల్యాలకు స్థానికంగా ఉండే నేతలను వేలెత్తి చూపటం మినహా తమ వ్యవహార శైలి ఎలాఉంటున్నదన్న స్పృహ అగ్ర నాయకత్వానికి కరువైంది. స్థానికంగా పార్టీని బలోపేతం చేస్తున్న వారిని అనుమానదృక్కులతో చూడటం, చురుగ్గా పనిచేస్తున్నవారికి వ్యతిరేకంగా ముఠాలను ప్రోత్సహించటం, విశ్వాసపాత్రులనుకున్న నాయకులకే అంతా కట్టబెట్టడం ఇంకా తగ్గలేదు. హరియాణాలో ఓటమికి ఇలాంటి పోకడలు కూడా కారణం. ఇప్పుడు ఢిల్లీ పార్టీలో ఉన్న అంతర్గత లోటుపాట్లను సవరించి బలోపేతం చేయటంపై దృష్టి సారించక ఆప్‌పై ఆరోపణతో కాలక్షేపం చేయటం కాంగ్రెస్ బలహీనతను సూచిస్తుంది. బెళగావిలోనైనా ఆ పార్టీకి జ్ఞానోదయమవుతుందా?

# పారదర్శకతకు పాతర




కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వ్యవహారశైలిపై, దేశ వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియపై అనేక అనుమానాలు తలెత్తుతున్న వేళ... అవి మరింత పెరిగే ప్రమాదం తాజాగా తలెత్తింది. ఎన్నికల నిర్వహణ నిబంధనల్ని మారుస్తున్నట్టు కేంద్ర సర్కార్ శుక్రవారం ప్రకటించింది. నిబంధనల్లో సరికొత్త సవరణ వల్ల ఇకపై ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలనూ పరిశీలించే అవకాశం ప్రజలకు ఉండదు. సీసీ టీవీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజ్, అభ్యర్థుల వీడియో రికార్డింగుల లాంటి ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు ఇకపై అందుబాటులో ఉండవు. అదేమంటే, అలాంటివన్నిటినీ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచితే వాటిని దుర్వినియోగం చేస్తారనీ, అసలు ఓటరు భద్రతకే ప్రమాదకరమనీ పాలక వర్గాల వాదన. సోషల్ మీడియా యుగంలో, పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్ల దృశ్యాలు విస్తృతంగా అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో అది వట్టి డొల్ల వాదనే. ఎన్నికల నిబంధనల్లో మార్పుపై దేశ వ్యాప్తంగా అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నది అందుకే!"ఎన్నికకు సంబంధించిన మిగిలిన అన్ని పత్రాలనూ ప్రజాక్షేత్రంలో పరిశీలించేందుకు వీలుండాలి" అని 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 93(2)(ఎ) చెబుతోంది. దానికే ఇప్పుడు సవరణ చేశారు. ఈసీ సిఫార్సు మేరకు, కేంద్ర న్యాయశాఖ ఈ మార్పును నోటిఫై చేసింది. దాంతో, ఇప్పుడిక నిబంధనల్లో ప్రత్యేకంగా పేర్కొన్న పత్రాలను మాత్రమే జనం పరిశీలించవచ్చన్న మాట. అంతేకాదు... ఎన్నికల పత్రాలన్నిటినీ కోరినవారికి ఇవ్వాలంటూ ఈసీని ఇక కోర్టులు ఆదేశించడానికి వీలుండదు. చిత్రమేమంటే, ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పోలింగ్ కేంద్రంలో పోలైన ఓట్లకు సంబంధించిన పత్రాల కాపీలు, సెక్యూరిటీ కెమెరాలోని ఫుటేజ్, వీడియోలను ఓ పిటిషనర్‌కు అందించాల్సిందిగా పంజాబ్ %-% హర్యానా హైకోర్ట్ సరిగ్గా ఈ నెల 9వ తేదీనే ఆదేశా లిచ్చింది. అక్టోబర్ నాటి ఎన్నికల్లో అభ్యర్థి కాదు గనక సదరు పిటిషనర్ ఆ పత్రాలు కోరరాదని ఈసీ వాదించింది. హైకోర్ట్ మాత్రం అభ్యర్థికైతే ఉచితంగా, ఇతరులకైతే రుసుముపై పత్రాలివ్వాలన్న పిటిషనర్ వాదనతో ఏకీభవించింది. కోర్టు ఆదేశాన్ని తప్పక పాటించాల్సిన పరిస్థితి. కానీ, తద్భిన్నంగా ఎన్నికల సంఘం నిబంధనల్ని సవరించడం సహజంగానే చర్చనీయాంశమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తున్నప్పుడే, సామాన్య ఓటర్లకున్న తిరుగులేని సమాచార హక్కును సుప్రీమ్ కోర్ట్ నొక్కి వక్కాణించింది. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే వ్యక్తుల, సంస్థల వివరాలు తెలుసుకొనే హక్కు ప్రజలకుందని తేల్చి చెప్పింది. వివాదాస్పద బాండ్ల పథకాన్ని సమర్థించిన సర్కారుకు అది ఎదురుదెబ్బ. నిజానికి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, నిజాయతీలో రాజీకి తావు లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్పుడే స్పష్టం చేసినట్టయింది. అయినా సరే, ప్రభుత్వం చెవికెక్కించుకోకుండా ఇప్పుడు ఈసీ సిఫార్సు పేరు చెబుతూ, నిబంధనల సవరణకు దిగడం ప్రజాస్వామ్యవాదులకు దిగ్భ్రాంతి కలిగించే విషయం. ఓటర్లే స్వయంగా తమ ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా సాక్షిగా పంచుకుంటున్న రోజుల్లో సీసీ టీవీ దృశ్యాల పట్ల ఈసీ ఇంత హంగామా ఎందుకు చేస్తోందో అంతుపట్టదు. సీసీ టీవీ ఫుటేజ్ అందుబాటులో ఉంటే కృత్రిమ మేధతో దుర్వినియోగం చేసే ముప్పుందన్న ఈసీ వాదన కొంత నిజమైనా, డిజిటల్ యుగంలో అన్ని వీడియోలపై నిషేధం పెడతామా? సవాలుకు అది పరిష్కారం కాదు కదా!ఎన్నికల సంఘం సారథ్యంలో నిఖర్సుగా సాగాల్సిన ఎన్నికల ప్రక్రియ తాలూకు నైతిక నిష్ఠ శరవేగంగా హరించుకుపోతోందంటూ ప్రతిపక్షాలు అసలే గొంతు చించుకుంటున్న సమయంలో నిబంధనల్లో ఈ కొత్త సవరణలు చేయ డాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? ఎన్నికల రికార్డులనూ, డేటాను ప్రజాక్షేత్రానికి దూరంగా ఉంచాలన్న జ్ఞానోదయం హఠాత్తుగా పాలకులకూ, ఈసీకీ ఎందుకు కలిగినట్టు? జనం దృష్టి నుంచి ఏం దాచాలని చూస్తున్నారు? ప్రతిపక్షాలనే కాదు... పౌరులనూ వేధిస్తున్న ప్రశ్నలివి. పైగా విస్తృత స్థాయి చర్చ జరగకుండానే చేపట్టిన ఈ తొందరపాటు చర్య ఎన్నికల ప్రక్రియపై మరిన్ని అనుమానాలు పెంచేలా పరిణమిస్తుంది. ప్రజాస్వామ్య దేశంలో అది మరింత విషాదం. వాస్తవానికి భిన్న భౌగోళిక పరిస్థితులు, భాషలు, సంస్కృతులు, సమస్యలున్న సువిశాల దేశంలో అతి పెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియగా ఇన్నేళ్ళుగా విజయవంతంగా ఎన్నికలను నిర్వహిస్తూ రావడం గొప్పే. అందుకు మన రాజ్యాంగం ఏర్పరచిన సుస్థిర వ్యవస్థనూ, గత దశాబ్దాల్లో ఈసీ పాత్రనూ తప్పక ప్రశంసించాల్సిందే. కానీ ఏ ఎన్నికల ప్రక్రియకైనా పారదర్శకత ప్రాణాధారం. ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికీ అదే కీలకం. తీరా ఆ పారదర్శకతే ఇప్పుడు రానురానూ తగ్గుతూ పోతుంటే ఏమనాలి? ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంగా గొప్పలు చెప్పుకొనే మనం ఎటువైపు ప్రయాణిస్తున్నట్టు? అందులోనూ ఆంధ్రప్రదేశ్, హర్యానా సహా అనేక చోట్ల ఎన్నికల్లో ఈవీఎంలపై, వీవీప్యాట్లపై నీలినీడలు కమ్ముకున్న ప్రస్తుత పరిస్థితుల్లో... ఈ తరహా కొత్త నిబంధనతో పాలకులు ఏ రకమైన సూచన ఇవ్వదలిచినట్టు? ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వాసం పాదుకొనాలంటే, ఈ సరికొత్త నిబంధనల మార్పును పునఃపరిశీలించాలి. స్వతంత్రంగా సాగాల్సిన ఈసీ పాలకుల చేతిలో మరబొమ్మగా మారిపోతున్నట్టు విమర్శలు పెల్లుబుకుతున్న సందర్భంలో అది అత్యవసరం.

# ఈ మార్పు మంచికేనా?!

విద్య-సమాజం విడదీయలేనివి. అవి ఏకకాలంలో పరస్పరాశ్రితాలు, పరస్పర ప్రభావితాలు కూడా. ఒక సమాజంలో పిల్లలకు అందే విద్య ఆ సమాజ స్థాయికి ప్రతిబింబంగా ఉంటుంది. క్రమేపీ ఆ సమాజాన్ని మెరుగుపరుస్తుంది. తిరిగి ఆ ప్రభావంతో విద్య ఉచ్ఛస్థితికి వెళ్తుంటుంది. అందువల్లే సమాజ స్థితిగతుల అధ్యయనం ఆధారంగా విద్యావిధాన నిర్ణయాలుండాలంటారు. పాఠశాల విద్యలో ప్రస్తుతం అమలవుతున్న 'నో డిటెన్షన్' విధానాన్ని కేంద్రం రద్దు చేయటంపై లోతైన చర్చే సాగుతోంది. కేంద్రీయ విద్యాలయాలూ, నవోదయా విద్యాలయాలూ, సైనిక్ స్కూళ్లతోపాటు కేంద్రం నడిపే మరో 3,000 పాఠశాలల్లో తక్షణం ఈ విధానం అమల్లోకొచ్చింది. పర్యవసానంగా ఇకపై అయిదు, ఎనిమిది తరగతుల వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేనివారికి రెండు నెలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. రెండోసారి కూడా ఫెయిలైతే వారు తిరిగి అవే తరగతులు చదవాలి. వాస్తవానికి ఈ విధానం రద్దు కోసం 2019లోనే విద్యాహక్కు చట్టాన్ని కేంద్రం సవరించింది. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నది కనుక రద్దు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసింది. అప్పట్లో 16 రాష్ట్రాలూ, 2 కేంద్రపాలిత ప్రాంతాలూ కేంద్ర విధానానికి అంగీకారం తెలిపాయి. కానీ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలు మాత్రం వ్యతిరేకించాయి. నిర్ణయం తీసుకున్న అయిదేళ్ల తర్వాత తాజాగా నోటిఫికేషన్ వెలువడింది. 'నో డిటెన్షన్' విధానంపై అనుకూల వాదనలు ఎన్ని వున్నాయో, ప్రతికూల వాదనలు కూడా అంతకు మించే ఉన్నాయి. అనుకూల వాదనలు తీసిపారేయదగ్గవి కాదు. ఈ విధానంవల్ల డ్రాపౌట్ల శాతం గణనీయంగా తగ్గిందని, ఉత్తీర్ణత సాధించలేమన్న భయాన్ని విడనాడటంవల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతున్నదని, అందరూ తమను చిన్నచూపు చూస్తారన్న ఆందోళన తగ్గిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక విద్యార్థిని ఫెయిల్ చేసినంత మాత్రాన నైపుణ్యం పెరుగుతుందన్న గ్యారెంటీ ఏమీ లేదని, పైగా తనతో చదివినవారంతా పై తరగతులకు పోవటంవల్ల ఆత్మ న్యూనతకు లోనై, ఒత్తిడి పెరిగి విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉన్నదని కూడా 'నో డిటెన్షన్' సమర్థకులు చెబుతున్నారు. విద్యాహక్కు చట్టం 'నో డిటెన్షన్' విధానం పెట్టి ఊరుకోలేదు. అందులోని 29(2)(హెచ్) నిబంధన విద్యాబోధన తీరుతెన్నులనూ, పిల్లల అధ్యయన నైపుణ్యాలనూ మెరుగుపరిచేందుకు సమగ్ర, నిరంతర మూల్యాంకన(సీసీఈ) విధానం ఉండాలని సూచిస్తోంది. సంప్రదాయ పరీక్ష విధానానికి బదులుగా నిర్దేశించిన ఈ విధానం ఆచరణలో ఎలా అమలవుతున్నదో ఎవరైనా పరిశీలించారా? ఇది సక్రమంగా అమలైతే ఎప్పటికప్పుడు పిల్లల గ్రాహకశక్తిని అంచనా వేసి చదువుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటానికి అవకాశం ఉండేది. కానీ ఉపాధ్యాయులకు అప్పజెప్పే ఇతరేతర పనులవల్ల కావొచ్చు... వారిలోని అలసత్వం వల్ల కావొచ్చు%-% పిల్లలపై శ్రద్ధ తగ్గిందన్నది 'నో డిటెన్షన్' విధానం రద్దు అనుకూలుర మాట. 'ఎలాగైనా' ఉత్తీర్ణులమవుతామన్న ధైర్యంతో పిల్లలు చదవటం లేదని, అలాంటివారి విషయంలో ఉపాధ్యా యులు కూడా నిర్లిప్తంగా ఉండిపోతున్నారని, ఇందువల్ల ఇతర పిల్లలపై కూడా ఆ ప్రభావంపడి మొత్తంగా విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని వారి వాదన. చాలా రాష్ట్రాల్లో పాలకులు పాఠశాల విద్యపై సమగ్ర దృష్టి సారించటం లేదు. ఈ విషయంలో కేరళ తర్వాత ఢిల్లీ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యారంగ ప్రక్షాళన ఒక యజ్ఞంలాగే నడిచింది. ఒకపక్క సకల సదుపాయాలతో పాఠశాల భవనాలను తీర్చిదిద్దటంతోపాటు పిల్లల చదువులను మెరుగుపరిచేందుకు వీలుగా తరగతి గదుల్లో ఎన్నో బోధనోపకరణాలు ప్రవేశపెట్టారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. సీబీఎస్‌ఈ, ఐబీ సిలబస్‌ల అమలుకు అంకురార్పణ చేశారు. ఈ తరహా సిలబస్‌లు ప్రవేశపెట్టిన ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ వంటివి ట్యూషన్ ఫీజు కింద రూ. 14 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయని ఈమధ్య మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రభుత్వాలు పాఠశాల విద్యను నిరంతరం పర్యవేక్షించి తగినంతమంది టీచర్లను నియమిస్తే, సదుపాయాలు మెరుగుపరిస్తే, ప్రామాణికమైన సిలబస్‌లు ప్రవేశపెడితే పిల్లల నైపుణ్యాలు పెరుగు తాయి. ప్రైవేటు విద్యలో ఎల్‌కేజీ నుంచే పిల్లల్లో పోటీ తత్వాన్ని పెంచే అనారోగ్యకర విధానాలు అమలవుతున్నాయి. కాన్సెప్ట్ స్కూళ్లు ఈ పోటీని మరింత పెంచాయి. 'పిండికొద్దీ రొట్టె' అన్నట్టు డబ్బు పారేస్తే తమ పిల్లలు అమాంతం ఎదుగుతారన్న భ్రమల్లో తల్లిదండ్రులున్నారు. మరి సర్కారీ బడుల్లో పిల్లల్ని చదివిస్తున్న పేద తల్లిదండ్రులు ఏం కావాలి... వారి పిల్లలకు మెరుగైన విద్య ఎలా అందాలి? గోరుచుట్టుపై రోకటి పోటులా ఇప్పుడున్న 'నో డిటెన్షన్' విధానం రద్దయితే పేద పిల్లలు ఎప్పటికి మెరుగుపడాలి? ఎదిగాక ఏం చేయాలి? కేంద్రం ఏ విధానం అమలు చేయదల్చుకున్నా దానికి ముందు బావురుమంటున్న ప్రభుత్వ బడులను ఉద్ధరించాలి. అక్కడి పిల్లలకు కడుపునిండా తిండి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే బోధన ఉంటున్నాయో లేదో గమనించాలి. ఉపాధ్యాయుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించాలి. వారిని బోధనకే పరిమితం చేయాలి. 'నాణ్యత అనేది యాదృచ్ఛికంగా ఊడిపడదు. అది నిరంతరం కొనసాగే వేనవేల బౌద్ధిక చర్యల సమాహారం' అన్నారు ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్. పాలకులు దాన్ని గుర్తెరగాలి.



# దేశం పాడిన గాయకుడు



కిశోర్ కుమార్ మీద సంజయ్ గాంధీ కినుక వహించాడు. 'ఇరవై సూత్రాల పథకం' ప్రచారం కోసం దూరదర్శన్ లో మొదలెట్టిన 'గీతోం భరీ షామ్'లో పాడమని కిశోర్‌ని సంజయ్ గాంధీ ఆదేశించాడు. డబ్బులు లేకుండా కిశోర్ పాడడు. ఆదేశిస్తే అసలు పాడడు. దాంతో కిశోర్ గొంతుకు రేడియోలో తాళం పడింది. సినిమాల్లో పాడిస్తే ఏం గొడవోనని నిర్మాతలు వెనక్కి తగ్గారు. 'ఆరాధన' సూపర్ హిట్ తర్వాత కిశోర్‌కు వచ్చిన తిప్పలు ఇవి. అప్పుడు కొంతమంది రఫీ దగ్గరకు వచ్చి 'కిశోర్‌కు శాస్తి జరిగింది. ఈ కాలాన్ని ఉపయోగించుకోండి' అన్నారు. రఫీ ఏం మాట్లాడలేదు. ఢిల్లీ వెళ్లి సంజయ్‌ను కలిశాడు. 'మీరు కిశోర్ మీద బ్యాన్ ఎత్తేయండి. అందుకు బదులుగా ఒకటి కాదు పది ప్రోగ్రామ్‌లు చేసిస్తాను' అన్నాడు. ఆ వెంటనే నౌషాద్‌ను వెంటబెట్టుకుని దూరదర్శన్‌లో ప్రోగ్రామ్ ఇచ్చాడు. కిశోర్ బ్యాన్ పోయింది.పత్రికలు కూడా కిలాడీవి. రాజేష్ ఖన్నా స్టార్‌డమ్‌తో కిశోర్ గొంతు గిరాకీలోకి రాగానే 'రఫీ పని అయిపోయింది' అని రాయడం మొదలెట్టారు. రికార్డింగులు లేక రఫీ గోళ్లు గిల్లుకుంటున్నాడని రాశారు. కిశోర్ తైనాతీలు ఇవన్నీ తెచ్చి కిశోర్‌కి చూపించారు. కిశోర్ సంతోషించాడా? ప్రెస్‌మీట్ పెట్టి 'ఇలాంటి వెధవ రాతలు మానండి. ఆయనంటే నాకు చాలా గౌరవం. మీరు ఎవర్ని గెలిపించి ఎవర్ని ఓడిస్తారు?' అన్నాడు. ఈ ఇద్దరిని కొంతమంది ఫలానా మతం అనుకుంటారు. ఈ ఇద్దరు మాత్రం ఈ దేశవాసులు. రామ్, రహీమ్‌ల సన్మతి ఎరిగినవారు.రంజాను మాసంలో రికార్డింగుకు వచ్చి 'హుక్కే మే ధువా' (హుక్కా పొగ) అనే పదం చూసి పాడనన్నాడు రఫీ ఉపవాసానికి భంగమని. మతం అంటే అంత నిష్ఠ. సాటి మతం పట్ల? అంతే నిష్ఠ. 'మన్ తర్‌పత్ హరి దర్శన్ కో ఆజ్'.... 'బైజూ బావరా'లో రఫీ పాడితే కన్నీరు ఆగదు వినేవారికి. ఆ కాలంలో అనేక ఆలయాల్లో ఇది ప్రభాతగీతం. దీనిని పాడింది, రాసింది, స్వరం కట్టింది... రఫీ, షకీల్ బదాయునీ, నౌషాద్. 'నా గొంతు రొటీన్ అవుతోంది. నాకు భజనలు పాడాలని ఉంది' అని రఫీ వస్తే ఖయ్యాం ఆ కోరిక మన్నించి భజనలు పాడించి అపురూపమైన రికార్డు విడుదల చేశాడు. 'రఫీ గొంతులో దేవుడు ఉన్నాడు' అని అందరూ అనేవారే. ఆ దేవుడు అల్లాయా, ఈశ్వరుడా వెతకడం అల్పుల పని. 1950%-%70ల మధ్య మన దేశ సినీ సంగీతం దాదాపు అన్ని భాషల్లో స్వర్ణయుగం చూసింది. సినిమా %-% దేశవాసులను కలిపే కొత్త మతం అయ్యింది. కళాకారులు వినోద ఉల్లాసాలకే కాదు సామ రస్య, సౌభ్రాతృత్వాలకు ప్రవక్తలుగా మారారు. దేశ విభజన చేదు నుంచి జనాన్ని బయట పడేయడానికి గుర్తెరిగి బాధ్యతగా నడుచుకున్నవారే అందరూ! 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా ఇన్‌సాన్ కీ ఔలాద్ హై ఔలాద్ బనేగా'... (నువ్వు హిందువువి కావద్దు, ముసల్మానువి కావద్దు, మనిషిగా పుట్టినందున మనిషిగా మిగులు) అని సాహిర్ రాయగా రఫీ పాడి చిరస్మరణీయం చేశాడు. మదన్ మోహన్ ట్యూన్ చేసిన 'కర్‌చలే హమ్ ఫిదా'... రఫీ పాడితే నేటికీ సరిహద్దు సైనికులకు తేజోగీతమే. గాంధీజీని బలిగొన్నారన్న వార్త తెలియగానే సంగీత దర్శకులు హన్స్‌లాల్%-%భగత్‌రామ్, గీతకర్త రాజేంద్ర కిషన్ కలిసి ఆయనకు నివాళిగా 'సునో సునో అయ్ దునియావాలో బాపు కీ ఏ అమర్ కహానీ' రూపొందిస్తే ఇంకెవరు పాడతారు రఫీ తప్ప! బాపు పాదాల ఎదుట పారిజాతాల కుప్ప గదా ఈ పాట.సరళత్వము, తీయదనము, స్వచ్ఛత... వీటిని ప్రదర్శించడం ద్వారా ముప్పై ఏళ్ల పాటు పాడి కోట్ల మంది అభిమానులను పొందిన అమృత గాయకుడు రఫీ. 'సుహానీ రాత్ ఢల్ చుకీ, 'చౌదవీ కా చాంద్ హో', 'బహారో ఫూల్ బర్సావో', 'ఓ దునియా కే రఖ్‌వాలే', 'ఖోయా ఖోయా చాంద్', 'దీవానా హువా బాదల్', 'క్యా హువా తేరా వాదా'... ఈ పాటలకు అంతూ పొంతూ ఉందా? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు... ఏ ప్రాంతమో ఏ భాషో... అందరూ రఫీ అభిమానులు. రోజువారీ పనిలో, కాయకష్టంలో, సేద తీరే వేళ, వేడుకల్లో రఫీ.. రఫీ... రఫీ! కూతురిని

# హసీనా అప్పగింత సాధ్యమేనా?



బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచీ మన దేశానికి తలెత్తుతున్న దౌత్య సమస్య లకు తాజాగా మరొకటి వచ్చిచేరింది. గత ఆగస్టు నుంచీ భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని సోమవారం బంగ్లా విదేశాంగ శాఖ దౌత్య సందేశం పంపింది. హసీనా అవినీతి పాలనను వ్యతిరేకిస్తూ విద్యార్థుల నాయకత్వంలో జనాగ్రహం వెల్లువెత్తి ఆమె ఆ దేశం నుంచి నిష్క్రమించారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ మైనారిటీలకూ, హసీనా హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలకూ, ఉన్నతాధికారులకూ గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దాడులూ, దౌర్జన్యాలూ, నిర్బంధాలూ తప్పడం లేదు. ఆఖరికి న్యాయమూర్తుల్ని సైతం వెంటాడుతున్నారు. భయోత్పాతంలో ముంచెత్తుతున్నారు. చాలామంది అజ్ఞాతంలోకి పోయారు. దీన్నంతటినీ ఆపాలనీ, మైనారిటీలకు రక్షణ కల్పించాలనీ మన దేశం ఇప్పటికే బంగ్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ కక్షపూరిత చర్యలు ఎక్కడా తగ్గిన దాఖలా లేదు. పైగా భారత మీడియా ఉన్నవీ లేనివీ కల్పించి తప్పుడు ప్రచారం చేస్తున్నదని అక్కడి ప్రభుత్వం ఆరోపిస్తోంది. అంతేకాదు... దానికి సమాంతరంగా అంతా బాగానే ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తోంది. 'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన కథనమే ఇందుకు ఉదాహరణ. విద్యార్థి బృందాలు దేశాభివృద్ధికి, అవినీతి అంతానికి ప్రణాళికలు వేస్తున్నట్టు ఆ కథనం సారాంశం. మైనారిటీలు సురక్షితంగా ఉన్నట్టు ఆ వర్గాల నేతలతోనే చెప్పించారు. నోబెల్ శాంతి బహుమతి పొందిన యూనస్ పాలన తీరుతెన్నులు గమనిస్తే పరిస్థి తులు ఆయన నియంత్రణలో ఉన్నట్టు కనబడదు. మైనారిటీల సంగతలావుంచి అసలు ముస్లిం మహిళలకే ఇబ్బందులు తప్పడం లేదు. మత ఛాందసవాదులు రంగంలోకి దిగి బురఖా ధరించని బాలికలనూ, మహిళలనూ నడిరోడ్లపై పంచాయతీలు పెట్టి హింసిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. హసీనా ఏలుబడిలో అవినీతి పెరిగిందనటంలో సందేహం లేదు. పదవి కాపాడుకొనేందుకు ఎన్నికల ప్రక్రియను ఏమార్చారన్న ఆరోపణల్లో కూడా నిజం వుంది. కానీ దానికి విరుగుడు ఈ అరాచకమా?!ప్రభుత్వాలను కూలదోసిన సందర్భాల్లో పాలకులు పరారీ కావటం, వేరేచోట ఆశ్రయం పొందటం అసాధారణమేమీ కాదు. హసీనా ఢిల్లీకి ఆదరా బాదరాగా వచ్చినా ఇక్కడినుంచి లండన్ వెళ్లాలని ప్రయత్నించారు. కానీ బ్రిటన్ ఆమె వినతిని తోసిపుచ్చింది. బంగ్లాలో హఠాత్తుగా బయ ల్దేరిన ఉద్యమానికి అమెరికా ఆశీస్సులున్నాయని ఆరోపణలొచ్చిన నేపథ్యంలో బ్రిటన్ ఆమె వినతిని తిరస్కరించటంలో వింతేమీ లేదు. కానీ ఆమెను అప్పగించాలని కోరిన వెంటనే మన ప్రభుత్వం అందుకు అంగీకరించటం సాధ్యమేనా? చట్టబద్ధ పాలన ఆనవాళ్లు లేవు సరికదా... ఎడాపెడా కక్షపూరిత విధానాలు అమలవుతున్నప్పుడు కోరిన వెంటనే ఒక మాజీ అధినేతను అప్ప గిస్తారని బంగ్లా ఎలా అనుకుంది? ఉగ్రవాదుల ఆటకట్టించేందుకు వీలుగా రెండు దేశాలూ 2013లో నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తగిన సాక్ష్యాధారాలు అందజేశాకే నేరస్తుల్ని అప్పగించాలని ఉన్న నిబంధనను కాస్తా వారెంటు జారీ అయితే చాలు అప్పగించవచ్చని సవరిస్తూ 2016లో ఆ ఒప్పందాన్ని సరళం చేశారు. కానీ తనపై పెట్టిన కేసులు న్యాయసమ్మతమైనవి కాదని, అందువల్ల అప్పగింత వినతిని తిరస్కరించాలని హసీనా మన ప్రభుత్వాన్ని కోరుకోవచ్చు. రాజ కీయ కారణాలతో అప్పగించాలని కోరితే తిరస్కరించొచ్చని ఒప్పందంలోని నిబంధనలే చెబుతున్నాయి. సంక్లిష్టమైన ఈ ప్రక్రియంతా పూర్తికావటానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హసీనా విషయంలో అక్కడి న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా వ్యవహరిస్తుందన్న విశ్వాసం తమకు లేదని మన ప్రభుత్వం చెప్పే అవకాశం కూడా ఉంది. ఒకవేళ మన దేశం అందుకు సంసిద్ధత చూపినా హసీనా మన కోర్టుల్ని ఆశ్రయించి ఉపశమనం పొందుతారు. బ్రిటన్‌తో మనకు నేరస్తుల అప్పగింత ఒప్పందం ఉన్నప్పటికీ రుణాలు తీసుకుని బ్యాంకులను వేలాది కోట్ల రూపాయల మేర మోసగించి పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా వంటివారిని రప్పించటం అసాధ్యమవుతున్నది. మన దేశంలో ఉగ్రవాద ఘటనలకు పాల్పడి పరారీలో ఉన్న నేరగాళ్లను పట్టి అప్పగించటానికి కొన్ని యూరప్ దేశాలు నిరాకరిస్తున్నాయి. మన న్యాయవ్యవస్థ, జైళ్లు ప్రామాణికంగా లేవన్న కారణాలు చూపుతున్నాయి. అసలు తన ప్రస్థానం ఏ విధంగా కొనసాగించదల్చుకున్నదో బంగ్లాదేశ్ నిర్ధారించుకోవాలి. ఆ దేశ ఆవిర్భావానికి మూలకారణమైన 'బెంగాలీ భావన'కు తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోంది. బంగ్లా విముక్తిని తాము గుర్తించబోమని చెప్పే ఘనులు తయారవుతున్నారు. అడుగడుగునా మత ఛాందసుల ప్రాబల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. మన దేశంతో సంబంధాల పునరుద్ధరణకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకొనేందుకు బంగ్లా ఇంతవరకూ సిద్ధపడలేదు. పైగా పాకిస్తాన్‌తో అంటకాగేందుకు ఉత్సాహపడుతోంది. 53 యేళ్ల క్రితం ఒక దేశంగా ఆవిర్భవించటానికి ముందు పాక్ సైనిక పాలకులు తమను ఎంత దారుణంగా అణచేశారో ఈ తరం మరిచిపోయి ఉండొచ్చు. 30 లక్షలమందికి పైగా ప్రజల బలిదానాలతో ఏర్పడిన దేశం కళ్లముందు కుప్పకూలుతుంటే నిశ్చేష్టులై ఉండిపోవటం విషాదకరం. అత్యంత విషమ పరిస్థితుల్లో కూడా ఎంతో అప్రమత్తతతో, వివేకంతో వ్యవహరించిన శ్రీలంక పౌరులను ఆదర్శంగా తీసుకుంటేనే దేశానికి మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని బంగ్లా ప్రజలు తెలుసుకోవాలి.



# హైదరాబాద్‌లో నెలకు రూ. 2.8 కోట్ల అద్దె..
# రూ. 16.8 కోట్ల అడ్వాన్స్.. ఫేస్‌బుక్ అదిరిపోయే డీల్..!

దేశంలో రియల్ ఎస్టేట్ రంగం.. కొవిడ్ తర్వాత గతేడాది నుంచే భారీగా పుంజుకుంది. ఎక్కడ చూసినా భూములు, ఫ్లాట్లు, ఆఫీసుల ధరలు పెరిగినా డీల్స్ కూడా జరుగుతూనే ఉన్నాయి. ఇదే క్రమంలో హైదరాబాద్ కూడా టాప్ సిటీస్‌కు పోటీనిస్తుంది. ఇప్పుడు ఇక్కడ ఫేస్‌బుక్.. తన ఆఫీస్ స్పేస్ లీజింగ్ డీల్‌ను పునరుద్ధరించుకుంది. నెలకు రూ. 2.8 కోట్లు చెల్లించేలా ఒప్పందం జరిగింది. ప్రముఖ సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం ఫేస్‌బుక్ (ఇప్పుడు మాతృసంస్థ మెటా) కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్ హైటెక్ సిటీ ప్రాంతంలో ఆఫీస్ స్పేస్ ఉండగా.. గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో ఐదేళ్లు పొడిగించుకుంది. మొత్తం ఇక్కడ ఒక కమర్షియల్ టవర్‌లో.. 3,67,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫేస్‌బుక్ కార్యాలయం ఉంది. దీని కోసం కొత్తగా రెండు లీజింగ్ ఒప్పందాలు జరిగాయి. ఇందులో భాగంగా.. ఫేస్‌బుక్ ఇప్పుడు నెలకు రూ. 2.8 కోట్ల అద్దె చెల్లించేలా అగ్రిమెంట్ జరిగింది. ఇది మొత్తం ఐదేళ్ల కాలానికి గానూ రూ. 170 కోట్లుగా ఉండనుంది. 2026 జనవరి నుంచి ప్రతి ఏటా అద్దె 15 శాతం పెరుగుతుందని ఒప్పందంలో ఉంది. ఈ డీల్ పునరుద్ధరణలో భాగంగా.. ఫేస్‌బుక్ దాదాపు 6 నెలల అద్దెకు సమానమైన రూ. 16.8 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్ (అడ్వాన్స్) కింద చెల్లించింది. %=ఫ్గీ%, రియాల్టీ డెవలపర్ మై హోం గ్రూప్ జాయింట్ వెంచర్ అయిన స్కై వ్యూ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఈ ఫేస్‌బుక్ కార్యాలయ స్థలం ఉంది.రెండు వేర్వేరు డీల్స్‌లో భాగంగా ఒకటి ఏప్రిల్‌లోనే ముగిసిపోయింది. మరొకటి ఈ నెల ప్రారంభంలో ఖరారైంది. ఈ మేరకు సదరు డాక్యుమెంట్స్‌ను.. ప్రముఖ రియాల్టీ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ చూయించింది. పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్‌లో ఆఫీసుల్ని తెరుస్తున్న వేళ.. ఫేస్‌బుక్ తన ఆఫీస్ స్పేస్ లీజింగ్ గడువును పొడిగించుకోవడం విశేషం. రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు కూడా హైదరాబాద్ నగరంలో ఫుల్ డిమాండ్ ఉంది. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలు కూడా ఇటీవల ఇక్కడ తమ శాఖల్ని ఓపెన్ చేస్తున్నాయని చెప్పొచ్చు.హైదరాబాద్ ఇటీవలి కాలంలో ఐటీ హబ్‌గా బెంగళూరుకు గట్టి పోటీనిస్తుంది. ఇక్కడ హైటెక్ సిటీ, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు ఐటీ, ఆర్థిక సేవలకు నెలవు. ఆఫీస్ స్పేస్ కూడా.. సాధారణంగా హైటెక్ సిటీలో సగటున అద్దెలు 2023లో నెలకు రూ. 27,500 గా ఉండగా.. 2019లో ఇది రూ. 23 వేలుగా ఉండేది. ఇలా క్రమంగా పెరుగుకుంటూ వస్తుందన్నమాట. అనరాక్ డేటా ప్రకారం.. కొండాపూర్‌లో 2019-23 మధ్యలో అద్దెలు 19 శాతం పెరిగాయి. గచ్చిబౌలిలో 20 శాతం పెరిగాయి. ఇక ఈ ఏడాది ఆగస్టులోనే ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ కూడా హైదరాబాద్‌లోని తన ఆఫీస్ స్పేస్ డీల్ పునరుద్ధరణ చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక్కడ నెలకు రూ. 2 కోట్ల రెంట్ చెల్లించేలా డీల్ కుదిరింది

# ఈ 2024లో నిండా ముంచిన మ్యూచువల్ ఫండ్స్ ఇవే..
# ఏకంగా 20 శాతం మేర నష్టాలు!




హైరిటర్న్స్ పొందవచ్చనే రిస్క్ తీసుకుని చాలా మంది మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతుంటారు. అయితే, ఈ 2024 ఏడాది ఓసారి పరిశీలిస్తే కొన్ని మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ ఇన్వెస్టర్లను నిండా ముంచేశాయి. ఈ ఏడాది ఏకంగా 20 శాతానికిపైగా నష్టాలను మిగిల్చాయి. మరి ఆ స్కీమ్స్ గురించి ఇప్పుడే మనం తెలుసుకుందాం .ఇటీవలి కాలంలో చాలా రకాల మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్స్ హైటర్న్స్ అందించాయి. దీంతో ప్రతి నెల వేల కోట్ల రూపాయలు మ్యూచువల్ ఫండ్లలోకి వస్తున్నాయి. అయితే, ప్రతి స్కీమ్ హైరిటర్న్స్ ఇస్తాయని నమ్మితే నష్టపోవాల్సి వస్తుంది. కొన్ని పథకాలు నెగెటివ్ రిటర్న్స్ సైతం అందించాయి. ఈ ఏడాది 2024లో ఇన్వెస్టర్లను కొన్ని ఫండ్స్ నిండా ముంచేశాయి. నష్టాలు మిగిల్చాయి. 2024లో మొత్తం 425 మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్స్ అందుబాటులో ఉండగా అందులో 34 స్కీమ్స్ నెగిటివ్ రిటర్నులు అందించాయి. సగటున 20 శాతం మేర పెట్టుబడులు నష్టపోవాల్సి వచ్చింది. కొన్ని పాపులర్ ఫండ్స్ గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.2024లో అత్యధికంగా నష్టపోయిన ఈక్విటీ స్కీమ్‌గా క్వాంట్ పీఎస్యూ ఫండ్ నిలిచింది. సిప్ ద్వారా నెల నెలా పెట్టుబడి పెట్టిన వారికి 20.28 శాతం మేర నష్టాలు వచ్చాయి. జనవరి 1, 2024 నుంచి ఈ స్కీమ్ లో నెలకు రూ.10 వేలతో ఎస్ఐపీ ప్రారంభిస్తే ఇప్పుడు ఆ విలువ రూ. 90,763 మాత్రమే. ఆ తర్వాత క్వాంట్ ఈఎల్ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్ 11.88 శాతం నష్టపోయింది. ఈ ఫండ్‌లో రూ. 10 వేల పెట్టుబడి రూ. 1,12,469గా ఉంటుంది. ఆ తర్వాత ఆదిత్య బిర్లా ఎస్ఎల్ పీఎస్యూ ఈక్విటీ ఫండ్ 11.13 శాతం మేర నష్టపోయింది. జనవరి 1, 2024 నుంచి నెలకు రూ. 10 వేల జమ చేస్తూ వచ్చినట్లయితే ఆ విలువ ఇప్పుడు రూ. 1,12,955 మాత్రంగానే ఉండేది.

క్వాంట్ కన్సంప్షన్ ఫండ్ 2024లో ఇప్పటి వరకు 9.66 శాతం నష్టాలు మిగిల్చింది.

క్వాంట్ క్వాంటమెంటల్ ఫండ్ 9.61 శాతం మేర నెగెటివ్ రిటర్న్స్ ఇచ్చింది.

క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ 8.36 శాతం మేర నష్టపోయింది.

క్వాంట్ బీఎఫ్ఎస్ఐ ఫండ్ 7.72 శాతం మేర నష్టాలు మిగిల్చింది.

క్వాంట్ యాక్టివ్ ఫండ్ ఈ ఏడాదిలో 7.43 శాతం నష్టపోయింది.

క్వాంట్ ఫోకస్డ్ ఫండ్ 6.39 శాతం మేర తగ్గింది.

క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్ 5.44 శాతం పడిపోయింది.

క్వాంట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ 4.54 శాతం మేర తగ్గింది.

యూటీఐ ట్రాన్స్ పోర్టేషన్ లాజిస్టిక్స్ ఫండ్ 4.05 శాతం నష్టపోయింది.

క్వాంట్ లార్జ్ క్యాప్ ఫండ్ 3.74 శాతం నష్టాలు మిగిల్చింది.

క్వాంట్ మొమెంటం ఫండ్ 3.35 శాతం నష్టపోయింది.

ఎస్బీఐ ఈక్విటీ మినిమం వేరియన్స్ ఫండ్ 3.06 శాతం నష్టాలు ఇచ్చింది.

హెచ్డీఎఫ్సీ ఎంఎన్ఎసీ ఫండ్ 1.51 శాతం మేర పడిపోయింది.

టౌరస్ మిడ్ క్యాప్ ఫండ్ 1.45 శాతం నష్టాలు ఇచ్చింది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ పీఎస్యూ ఈక్విటీ ఫండ్ 0.86 శాతం మేర పడిపోయింది.

ఎస్బీఐ పీఎస్యూ ఫండ్ 0.67 శాతం తగ్గింది


# ఆ ఎస్‌బీఐ స్కీమ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు బంద్..
# డిసెంబర్ 27 నుంచే అమలు.. కారణమిదే!

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి అలర్ట్. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కి చెందిన ఆ స్కీమ్‌లో కొత్తగా చేరేందుకు అవకాశం లేదు. ఇంటర్నేషనల్ ఫండ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేసినట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. అందుకు గల కారణాలను వెల్లడించింది. ఆ వివరాలు తెలుసుకుందాం.ఇటీవలి కాలంలో ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెలా కోట్లాది రూపాయలు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈక్విటీల్లోనూ కొన్ని స్కీమ్స్‌కు మంచి ఆదరణ ఉంటుంది. వాటిల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. అలాంటి వాటిల్లో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన పలు స్కీమ్స్ ఉన్నాయని చెప్పవచ్చు. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ నుంచి ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి అలర్ట్. తమ ఏఎంసీ నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ ఫండ్స్‌లోని ఓ ఫండ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది.అంటే ఇకపై ఆ ఫండ్‌లో కొత్తగా ఇన్వెస్ట్ చేసేందుకు ఉండదు.





ఇప్పటికే సబ్‌స్క్రైబ్ చేసుకున్న వారికి మాత్రమే ఫండ్ నిర్వహణ ఉంటుంది. అదే ఎస్‌బీఐ ఇంటర్నేషనల్ యాక్సెస్ యూఎస్ ఈక్విటీ ఫండ్ ఆఫ్ ఫండ్. ఈ ఫండ్‌లో కొత్త సబ్‌స్క్రిప్షన్లు ఆగిపోయాయి. అందుకు ప్రధాన కారణం ఉంది. ఇప్పటికే ఈ పథకంలో పరిమితి మేర పెట్టుబడులు వచ్చేశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన ఓవర్సీస్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిట్ దాటకూడదనే ఉద్దేశంతోనే కొత్త సబ్‌స్క్రిప్షన్లు ఆపేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది.ఈ మేరకు తమ యూనిట్ హోల్డర్లకు నోటీసు ద్వారా ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఎస్‌బీఐ ఫండ్ హౌస్ తెలిపింది. డిసెంబర్ 27, 2024 నుంచే కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని తెలిపింది. లంప్‌సమ్ పెట్టుబడుల ద్వారా సబ్‌స్క్రిప్షన్లు (అదనపు కొనుగోళ్లు, స్విచ్ ఇన్స్ సహా), ఐడీసీడబ్ల్యూ బదిలీ కోసం సిప్, ఎస్టీపీ ద్వారా కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేయబడతాయని నోటీసులో పేర్కొంది. డిసెంబర్ 26వ తేదీ కట్ ఆఫ్ టైమ్ తర్వాతనే ఈ ఆంక్షలు అమలులోకి వచ్చేస్తాయని గుర్తు చేసింది. %టాఞ్, ఞా, ×ఐజఔ% బదిలీ వంటి ప్రస్తుత సిస్టమాటిక్ రిజిస్ట్రేషన్లు తదుపరి నోటీసు వచ్చే వరకు పథకం కింద కొనసాగుతాయని పేర్కొంది. అలాగే స్కీమ్ పరిధిలో జరిగే బదిలీలు కొత్త రూల్స్ వర్తించవని తెలిపింది. అలాగే ఇతర షరతులు, నిబంధనలు ఏమీ మారవని స్పష్టం చేసింది.

# పొరపాటున రాంగ్ నంబర్‌కు యూపీఐ పేమెంట్ చేశారా? నో టెన్షన్.. 48 గంటల్లోనే ఇలా!




ప్రస్తుత డిజిటల్ యుగంలో క్యాష్ ట్రాన్సాక్షన్స్ ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇందులో యూపీఐ ఒక విప్లవం సృష్టించిందని చెప్పొచ్చు. అయితే పేమెంట్స్ చేసే సమయంలో మనం పొరపాటున ఎప్పుడైనా రాంగ్ నంబర్‌కు డబ్బులు పంపించే ప్రమాదం ఉండొచ్చు. ఎప్పుడైనా గతంలో అయినా చేసుండొచ్చు. ఇలాంటప్పుడు ఈ డబ్బుల్ని తిరిగి పొందేందుకు కూడా వెసులుబాట్లు ఉన్నాయి. అవేంటో చూద్దాం.మనకు ఈ యుగంలో లావాదేవీలు అంటే వెంటనే గుర్తొచ్చేది యూపీఐ పేమెంట్ సదుపాయం. డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌కు సంబంధించి ఇదొక విప్లవం తీసుకొచ్చిందని చెప్పొచ్చు. ఇప్పుడంతా యూపీఐ ట్రాన్సాక్షన్స్‌దే హవా. యూపీఐ ట్రాన్సాక్షన్స్.. ఎక్కువగా గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, పేటీఎం, %దీ౧×వీ% వంటి యాప్స్ వేదికగా జరుగుతున్నాయి. ఇక్కడ యూపీఐ ఐడీ, మొబైల్ నంబర్, క్యూఆర్ కోడ్ స్కాన్.. ఇలా దేనితో అయినా పేమెంట్స్ చేసే సదుపాయం ఉండటంతో ఎక్కువ మంది దీనిపైపు మొగ్గు చూపుతున్నారని చెప్పొచ్చు. ఈ క్రమంలోనే కొన్ని సార్లు పొరపాటున రాంగ్ నంబర్ ఎంటర్ చేసే ప్రమాదం ఉంది. అలా వేరే నంబర్‌కు డబ్బులు పంపుతుంటాం. మళ్లీ ఆ డబ్బును ఎలా రాబట్టాలో తెలియక తికమకపడిపోతుంటాం. అయితే ఆ డబ్బు తిరిగి పొందేందుకు కొన్ని మార్గాలుంటాయి.ట్రాన్సాక్షన్స్‌కు సంబంధించి.. పూర్తి వివరాల్ని భద్రపరుచుకోవాలి. యూపీఐ ఐడీ, లావాదేవీ ఐడీ, ట్రాన్సాక్షన్ చేసిన తేదీ, అమౌంట్ వివరాల్ని జాగ్రత్త పర్చుకోవాలి. ఇంకా యాప్ నుంచి డబ్బు పంపించిన డీటెయిల్స్ స్క్రీన్ షాట్ తీసుకోవడం మంచిది.మీరు ఏ యాప్ నుంచి పేమెంట్ చేశారో.. దాని కస్టమర్ కేర్‌ను సంప్రదించి వెంటనే విషయం తెలియజేయండి. ఏ యాప్ అయినా.. వినియోగదారుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ నిర్వహిస్తుంది. వారికి సాక్ష్యాలు చూపిస్తే.. రీఫండ్ ప్రాసెస్ గురించి మీకు సమాచారం ఇస్తారు.అప్పుడు యూపీఐ యాప్ కస్టమర్ సర్వీస్ నుంచి మీకు సరైన సాయం అందకుంటే.. పోర్టల్‌లో నేరుగా కంప్లైంట్ చేయొచ్చు. అధికారిక వెబ్‌సైట్లోకి వెళ్లి.. ఎడమవైపు కనిపించే యూపీఐ సెక్షన్లో డిస్ప్యూట్ రిడ్రెసల్ మెకానిజం ఆప్షన్ ఎంచుకోవాలి. తర్వాత కనిపించే.. కంప్లైంట్ సెక్షన్లో మీ ట్రాన్సాక్షన్స్‌కు సంబంధించిన వివరాలు ఎంటర్ చేయగానే ఫిర్యాదును స్వీకరిస్తుంది. అప్పుడు మీ డబ్బు తిరిగి రప్పించేందుకు వీళ్లు సాయం చేస్తారు.ట్రాన్సాక్షన్‌కు సంబంధించిన విషయాన్ని మీ బ్యాంకులో తెలియజేసి సాయం కోరవచ్చు. బ్యాంకు అడిగే అన్ని డీటెయిల్స్, డాక్యుమెంట్స్ అందించగానే రీఫండ్ కోసం ఛార్జ్ బ్యాక్ ప్రక్రియ మొదలుపెడతారు.

# మీ మెయిల్‌కే కొత్త 'పాన్ కార్డ్'..
# డౌన్‌లోడ్ చేసుకుంటున్నారా? ఒక్క క్షణం ఇది చదవండి!




కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పాన్ 2.0 ప్రాజెక్ట్ ప్రకటించింది. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్ పాన్ కార్డులు జారీ చేస్తోంది. ఈ క్రమంలో మెయిల్‌కో ఇ-పాన్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోండి అంటూ లింకులు వస్తున్నాయి. మరి మీకూ వచ్చిందా? ఆ లింకుల ద్వారా పాన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారా? అయితే, ఈ కథనం చదివి ఆ తర్వాత నిర్ణయం తీసుకోండి. కేంద్ర ప్రభుత్వం ట్యాక్స్ పేయర్లకు సేవలను మరింత సులక్షతరం చేసేందుకు పాన్ 2.0 ప్రాజెక్ట్ ప్రకటించింది. క్యూఆర్ కోడ్ ఉండే పాన్ కార్డులను జారీ చేస్తోంది. భౌతిక కార్డులతో పాటు డిజిటల్ రూపంలోనూ పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే పాత పాన్ కార్డులు రద్దు అవుతాయా? కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలా? లేదా? పాత కార్డులు ఉన్న వారికి కొత్త కార్డులు నేరుగా ఇస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అయోమయ పరిస్థితులను అదునుగా తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. తాజాగా ఇ- పాన్ కార్డు డౌన్‌లోడ్ పేరిత కొత్త తరహా మోసానికి తెరలేపారు.మీ కొత్త పాన్ కార్డును సులభంగా డౌన్‌లోడ్ చేసుకోండంటూ ఇ-మెయిల్స్ పంపిస్తున్నారు. అందులో ఉన్న లింక్ క్లిక్ చేస్తే నేరుగా డౌన్‌లోడ్ అయిపోతుందని సూచిస్తున్నారు. ఎలాగు కేంద్రం క్యూఆర్ కోడ్ పాన్ కార్డులు అంటుంది కాబట్టి మనకు సైతం ప్రభుత్వమే పంపి ఉంటుందని భావించే అవకాశం ఉంది. దీంతో ఏం ఆలోచించకుండా లింకులు క్లిక్ చేస్తున్నారు. అయితే, ఆ లింకులు క్లిక్ చేస్తే మీ ఖాతా ఖాళీ కావచ్చ ఖాయం. అలాంటి లింకులను క్లిక్ చేయొద్దని, అవన్నీ మోసపూరిత లింకులుగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది.ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం పేరుతో ఈ ఇ-మెయిల్స్ వస్తుండడం, అందులో డౌన్‌లోడ్ ప్రాసెస్ స్టెప్ బై స్టెప్ చెప్తామని పేర్కొనడంతో చాలా మంది నమ్మి మోసపోతున్నారు. అలాంటి ఇ-మెయిల్స్ మీకూ వస్తే లింక్స్ క్లిక్ చేయొద్దు. ఆదాయపు పన్ను విభాగం పేరుతో మీ దగ్గరి నుంచి యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్స్ దొంగలించి ఖాతా ఖాళీ చేసే అవకాశం ఉంటుంది. పిన్, పాస్వర్డ్స్ వంటివి వ్యక్తిగత ఇ-మెయిల్స్ ద్వారా ఇవ్వాలని ఆదాయపు పన్ను విభాగం ఎప్పుడూ కోరదు.ఇలాంటి ఇ-మెయిల్స్ వచ్చినప్పుడు ఎలా జాగ్రత్తపడాలే ఐటీ శాఖ సైతం పలు సూచనలు చేసింది. ఫిషింగ్ ఇ-మెయిల్స్ వస్తే వాటికి స్పందించవద్దని సూచించింది. అందులోని ఉండే లింకులను ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయవద్దని కోరింది. పొరపాటున చేసినా మీ వ్యక్తిగత సమాచారం ఎంటర్ చేయొద్దని సూచించింది. ఇ-మెలియ్స్, కాల్స్, ఎస్ఎంఎస్ ఇలా ఏ విషయానికి స్పందించవద్దని, ఆర్థిక, వ్యక్తిగత విషయాల వంటి సమాచారం పంచుకోవద్దని హెచ్చరించంది.




# మధ్య తరగతికి బిగ్ రిలీఫ్..
# రూ.15 లక్షల వరకు పన్ను తగ్గింపు..!

మధ్య తరగతి ప్రజలకు బిగ్ రిలీఫ్ అందించే ఆలోచనలో ఉంది కేంద్రం. ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించాలనే చూస్తోంది. రూ.15 లక్షల వరకు ఆదాయం గల వారికి పన్ను రేట్లను తగ్గించాలనే ఆలోచన చేస్తున్నట్లు ఓ నివేదిక తెలిపింది. వినియోగాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. ఆ వివరాలు తెలుసుకుందాం.2025, ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశ పెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు పన్ను భారం తగ్గించాలనే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పిస్తూ మధ్య తరగతి ప్రజలకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయాలు ఉండనున్నాయని పేర్కొంది. ఇందులో భాగంగా రూ.15 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయం గల వారికి ఇన్‌కమ్ ట్యాక్స్ భారాన్ని తగ్గించాలని చూస్తున్నట్లు కేంద్రంలోని ఇద్దరు ఉన్నతాధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ ఓ కథనం ప్రచురించింది. అయితే, ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలోనే ఉన్నట్లు తెలిపింది.రూ. 3 లక్షల నుంచి రూ. 15 లక్షలలోపు ఆదాయం ఉన్న వారికి ప్రస్తుతం 5- 20 శాతం ఇన్‌కమ్ ట్యాక్స్ రేట్లు వర్తిస్తున్నాయి. ఒక వేళ ఈ పన్ను రేట్లను మరింత తగ్గిస్తే లక్షలాది మందికి భారం తగ్గనుంది. అయితే రూ.15 లక్షల వరకు పన్ను రేట్లలో ఎంత తగ్గిస్తారనే విషయంపై స్పష్టత లేదని రాయిటర్స్ పేర్కొంది. యూనియన్ బడ్జెట్ ప్రకటనలోనే ఈ అంశంపై పూర్తి క్లారిటీ రావచ్చని తెలిపింది. ఇక రూ.15 లక్షలు ఆపైన ఆదాయం గల ఉన్నత వర్గాలపై పన్ను 30 శాతంగా ఉంది. అది అలాగే కొనసాగించవచ్చని తెలుస్తోంది.ప్రస్తుత దేశ ఆర్థిక వృద్ధి మందగమనంలో పయనిస్తోంది. నగరాలు, పట్టణాల్లో వినియోగం తగ్గిపోయి ఆందోళన కలిగించే స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో పన్నుల భారాన్ని తగ్గిస్తే ప్రజల చేతుల్లోకి ఎక్కువ డబ్బులు చేరి వినియోగానికి బూస్ట్ ఇచ్చినట్లు అవుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పన్ను భారం తగ్గితే మధ్య తరగతి ప్రజల వినియోగం పెరగవచ్చని అంచనా. అయితే పన్ను రేట్ల తగ్గింపు అంశంపై ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. కొద్ది రోజుల క్రితం ప్రధాని మోదీతో సమావేశమైన ఆర్థిక వేత్తలు సైతం పన్ను రేట్లు తగ్గించాలని కోరినట్లు సమాచారం. పన్ను మినహాయింపులు సైతం మరింత ఎక్కువగా కల్పించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో బడ్జెట్ వరకు వేచి చూడాల్సిందే.ప్రస్తుతం మన దేశంలో రెండు పన్ను విధానాలు ఉన్నాయి. పాత పన్ను విధానంలో వివిధ పెట్టుబడులు, ఖర్చులపై మినహాయింపులు పొందవచ్చు. ఇక 2020లో తెచ్చిన కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి పెట్టుబడులపై మినహాయింలు కల్పించలేదు. ఈ క్రమంలో కొత్త పన్ను విధానంలోనూ పన్ను మినహాయింపులు ఇవ్వాలని ట్యాక్స్ పేయర్లు కోరుతున్నారు. చాలా కాలంగా ఈ డిమాండ్ వినిపిస్తోంది.

**పాత పన్ను విధానంలో పన్ను రేట్లు..**

రూ. 2,50,000 వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను లేదు. రూ. 2.5- 5 లక్షల వరకు 5 శాతం, రూ. 5- 10 లక్షల వరకు 20 శాతం, రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉంటే 30 శాతం ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది. అయితే పాత పన్ను విధానంలో వివిధ పెట్టుబడులు, ఇన్సూరెన్స్ వంటివాటిపై మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవచ్చు.

### కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు

రూ. 3 లక్షల వరకు పన్ను ఉండదు. రూ. 3- 7 లక్షల వరకు 5 శాతం పన్ను పడుతుంది. రూ. 7- 10 లక్షల వరకు 10 శాతం, రూ. 10- 12 లక్షల వరకు 15 శాతం, రూ. 12- 15 లక్షల వరకు 20 శాతం, రూ. 15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నట్లయితే 30 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది. కొత్త విధానంలో పన్ను రేట్లు తక్కువగా ఉన్న నేపథ్యంలో మధ్యతరగతి వారు ఈ విధానాన్నే ఎంపిక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇందులోనూ ట్యాక్స్ మినహాయింపులు కల్పించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

# వేతనాల బడ్జెట్ వందశాతం ఖర్చు కావాలి

### పల్లెపండుగ బిల్లులు అప్‌లోడ్ వేగవంతం కావాలి

### ఉపాధిహామీ పనుల సమీక్షలో జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ ఆదేశాలు



విజయనగరం,):జిల్లాకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేటాయించిన వేతనాల బడ్జెట్ వందశాతం ఖర్చు చేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఉపాధిహామీ ఏపిఓలను ఆదేశించారు. వేతనాల రూపంలో ఖర్చుచేయాల్సిన బడ్జెట్ పూర్తిగా ఖర్చుచేయని పక్షంలో జిల్లా నష్టపోతుందని, జిల్లాకు మెటీరియల్స్ కాంపొనెంట్ కింద రావలసిన నిధులు తగ్గిపోతాయన్నారు. లేబర్ బడ్జెట్‌ను గడువులోగా ఖర్చుచేసే బాధ్యత ఏపిఓలదేనని స్పష్టంచేశారు. రోజుకు కనీసం మూడువేల మంది వేతనదారులను పనుల్లోకి వచ్చేలా చర్యలు చేపట్టి కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలన్నారు.



ఉపాధిహామీ పనులు, పల్లెపండుగ పనుల ప్రగతిపై కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో పంచాయతీరాజ్, ఉపాధిహామీ అధికారులతో సమీక్షించారు. వందరోజుల పని పూర్తిచేసిన కుటుంబాల సంఖ్య కూడా పెరగాల్సి వుందన్నారు. పల్లెపండుగ పనులకు సంబంధించి బిల్లులు జాప్యం లేకుండా వెనువెంటనే అప్‌లోడ్ చేసి చేసిన పనులకు ఖర్చు చూపించాలన్నారు. పనులు పూర్తవుతున్నప్పటికీ అందుకు తగిన విధంగా బిల్లులు అప్‌లోడ్ కావడం లేదని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పూర్తయిన దశలో వున్న పనులను రెండు మూడు రోజుల్లో పూర్తిచేయాలని చెప్పారు. పశువుల షెడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పునాది, పైకప్పు స్థాయిలో నిర్మాణంలో వున్న 498 షెడ్లను తక్షణం పూర్తిచేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్.ఇ. శ్రీనివాసరావు, డ్వామా పి.డి. శారదాదేవి, పంచాయతీరాజ్ డి.ఇ., ఏ.ఇ.లు, ఉపాధిహామీ ఏపిఓలు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ సంఘ నాయకులు



విజయనగరం : రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ సెర్ప్ ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను శనివారం మంత్రి క్యాంప్ ఆఫీస్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుచ్చిబాబు,జిల్లా కార్యదర్శి కాపారపు వెంకట రమణ, జిల్లా యువజన అధ్యక్షులు వాళ్లే హరిబాబు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి బొబ్బాదిచంద్ర నాయుడు జిల్లా యువజన కార్యదర్శి ఆతవ సన్యాసిరావు, జిల్లా నాయకులు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు

# మానస దేవిని దర్శించుకున్న సినీ నటుడు సుమన్



చీపురుపల్లి **జనవరి** : మండలంలోని రామలింగాపురం గ్రామంలో వెలసిన మానస దేవి ఆలయాన్ని ప్రముఖ సినీ నటుడు సుమన్ శనివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పిన్నింటి రమణ దంపతులతో పాటు పిన్నింటి శ్రీనివాసరావు, సారిక మోహన్ రావు లు సినీ నటుడు సుమన్ కు సాంప్రదాయ పద్ధతిలో పూర్ణ కలశాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి సుమన్ కు తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. మానస దేవి చిత్రపటాన్ని అందజేసి దుస్సాలవ తో సన్మానించారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ అరుకు ప్రాంతంలో షూటింగ్ జరుగుతున్న నేపథ్యంలో అమ్మవారి మహిమలు గూర్చి తెలుసుకొని ప్రత్యేకంగా దర్శించుకోవడానికి వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ కమిటీ చైర్మన్ గా గవిడి నాగరాజు



చీపురుపల్లి : చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గవిడి నాగరాజుని ఆలయ కమిటీ చైర్మన్ గా నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ నుండి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు టీడీపీ వర్గాలు తెలిపాయి. గవిడి నాగరాజు గత కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలం నుండి తెలుగుదేశం పార్టీ చీపురుపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. చీపురుపల్లి లో మాజీ మంత్రి కిమిడి మృణాళిని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, కిమిడి నాగార్జున టీడీపీ ఇన్చార్జి బాధ్యతలు చేపట్టినప్పుడు నుండి తెలుగుదేశం పట్టణ పార్టీలో ఆయన కీలకంగా ఉన్నారు. శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ పదవి వరించడం పట్ల ఆయన అభిమానులు, మిత్రులు, పార్టీ నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షులు ఎన్నిక కూడా దాదాపు ఖరారైంది. నడిపల్లి సంఘం అధ్యక్షుడిగా అలమండ నర్సింహమూర్తి, కర్లాం అధ్యక్షుడిగా కెల్ల రామారావు, రామలింగాపురం సంఘం అధ్యక్షుడిగా ఇప్పిలి సురేష్ లను నియమించినట్టు తెలిసింది.

# అంబేద్కర్ రాజ్యాంగం అవసరం..

### ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపకులు షణ్ముఖరావు



విజయనగరం **జనవరి** : ఈ దేశానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం అవసరమని,అంబేద్కర్ ఆశయ సాధనకు మేమంతా కృషి చేస్తామని ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పి.షణ్ముఖరావు అన్నారు. అంబేద్కర్ కూడలిలో గల ప్రజా గ్రంథాలయంలో శుక్రవారం ప్రజా విజయం పార్టీ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపకులు షణ్ముఖరావు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తిగా ప్రజా విజయం పార్టీ ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజా విజయం పార్టీ కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి,న్యాయవాది డాక్టర్ పైల రమేష్ రాజు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్లో అంబేద్కర్ పై మాట్లాడిన తీరు బాధాకరంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని అనగదొక్కేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా వచ్చిన పదవులు అనుభవిస్తూ, అదే రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడటం దురదృష్టకరం అన్నారు.ప్రజాస్వామ్యవస్థను కాపాడుకోవాలంటే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఇందుకోసం ప్రజలంతా సంఘటితమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా విజయం పార్టీ కార్యదర్శి సిహెచ్ బంగారు రాజు, మహిళా సంఘం కన్వీనర్ జి.భవాని, ప్రజా సంఘాల నాయకులు సోము మురళీమోహన్, కెల్ల సత్యం, శిరాపు శ్రీనివాసరావు,రేగేటి సంతోష్, గరుగుబిల్లి వినయ్ బాబు,పెంట సంతోష్,గండి బోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో జిల్లా విద్యార్థులు పోటీపడాలి

### శాసనసభ్యులు బోనెల విజయచంద్ర

పార్వతీపురం,: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయస్థాయిలో జరిగే యువజన ఉత్సవాలలో జిల్లా విద్యార్థులు పోటీపడాలని పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ చంద్ర విద్యార్థులకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే జిల్లా విద్యార్థులకు తాను నిధులు సమకూరుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ మరియు నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలు శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగాయి. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో యువత ఎక్కువగా ఉన్నారని,వారిలోని ప్రతిభ, కళా నైపుణ్యాలను ఇటువంటి కార్యక్రమాల్లో ప్రదర్శించడం ద్వారా మంచి గుర్తింపు తెచ్చు కోవచ్చని






అన్నారు. సమాజహితం కోసం ఎంతో కృషిచేసిన స్వామి వివేకానంద డా.బి.ఆర్.అంబేద్కర్ జీవితాలు ప్రజల మదిలో చిరస్థాయిగా మిగిలిపోయాయని, అదేవిధంగా నేటితరం సమాజం కోసం నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలని పిలుపు నిచ్చారు. దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని, దేశ భవితకు దశా దిశా నిర్దేశం చేసేది యువతేనని ఆయన అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్ ఏ 2047 నాటికి మన దేశం ప్రపంచంలో తొలిస్థానంలో నిలవాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అందుకు తగిన విధంగా యువత కృషి చేయాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లాకు ఒక చరిత్ర ఉందని, జిల్లా పేరును దశదిశలా మారుమ్రోగేలా యువత నడుచుకోవాలని అన్నారు. అదే సమయంలో మన విలువలు, సంస్కృతి, సంపదను తరతరాలుగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. యువత ఓర్పును అలవర్చు కోవాలని, నేర్చుకోవాలనే తపన ఉండాలని తద్వారా లభించే ప్రతిఫలం ఉత్తమంగా ఉంటుందని ఆయన గుర్తుచేసారు. అనంతరం విద్యార్థులు రూపకల్పన చేసిన విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలను ఆయన తిలకించారు. తదుపరి విద్యార్థులతో కలిసి ధింసా నృత్యంలో పాల్గొని, న్యాయనిర్ణేతలకు అవార్డులను ప్రధానం చేసారు. నెహ్రూ యువక కేంద్రం జిల్లా యువజన సంక్షేమ అధికారి కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ 15 నుంచి 29 ఏళ్లలోపు వయసు గల యువత వివిధ విభాగాల ద్వారా ఈ ఉత్సవాల్లో పాల్గొనేలా అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడ ప్రదర్శించిన విభాగాలలో విజేతలను ఎంపిక చేసేందుకు 19 మంది న్యాయ నిర్ణేతలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన ప్రథమ స్థానం విజేతలను రాష్ట్రస్థాయికి, అందులో గెలుపొందిన వారికి జాతీయస్థాయికి పంపడం జరుగుతుందని చెప్పారు. సెట్విజ్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి బి.రామ్ గోపాల్ మాట్లాడుతూ జానపద గీతాలు, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన వంటి పోటీలు ఈ ఉత్సవాలలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన తొలి స్థానం విజేతలు రాష్ట్రస్థాయికి వెళ్తారని, యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు మాట్లాడూతూ యువతలో ఉండే ప్రతిద, కళా నైపుణ్యాలు వెలికి తీసేందుకు యువజన ఉత్సవాలు దోహదపడతాయని అన్నారు. ఇటువంటి వేదికలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో



జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, మండల విద్యాశాఖాధికారులు విమల కుమారి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శివనారాయణ, తహశీల్దారు వై.జయ లక్ష్మి,ఎంపీడిఓ కె.రూపేశ్, ఎన్.ఎస్.ఎస్ పీఓ టి.రవికుమార్,ఇతర అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రికి విశాఖలో ఘన స్వాగతం

### పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు, అధికారులు



విశాఖపట్నం,: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



నాయుడుకి విశాఖపట్టణం ఎయిర్ పోర్టులో రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. నావికాదళ విన్యాసాల్లో పాల్గొనే నిమిత్తం శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానం ద్వారా విశాఖపట్నం అంతర్జాతీయ



విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్ వచ్చారు. ఈ క్రమంలో ఈస్టర్న్ నేవల్ కమాండ్,



ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్, జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ పిజివిఆర్ నాయుడు(గణబాబు), విప్ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషను చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎ.పి. కొ-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గోవర్స్ ఫెడరేషను చైర్మన్



గండిబాబ్జి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ



కమిషనర్ పి. సంపత్ కుమార్, డీసీపీ డి. మేరీ ప్రశాంతి, ఆర్డీవో పి. శ్రీలేఖ, మాజీ శాసనసభ్యులు దాడి వీరభద్రరావు, దాడి రత్నాకర్ ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. విమానాశ్రయం బయట కార్యకర్తలను కలుసుకొని, వారి నుంచి ముఖ్యమంత్రి వినతులు స్వీకరించారు. అనంతరం నేవీ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు కాన్వాయ్ ద్వారా బయలుదేరి వెళ్లారు.

# సంక్షేమానికి శత-శాతం రుణాలివ్వాలి

### రబీలో ఏటా పంట సాగు 15శాతం పెంచాలి

### బ్యాంకర్స్ సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్


### గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

విజయనగరం,): సంక్షేమ శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు శతశాతం రుణాలను మంజూరు చేసి, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. జిల్లా స్థాయి డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. బ్యాంకుల సహకారంతో అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు, లక్ష్యాల సాధనపై ఈ సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. పిఎంఈజిపి, పిఎంఎఫ్ఎంఈ, సిసిఆర్సి కార్డ్స్, పంట రుణాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెట్ 2047 లో భాగంగా జిల్లాలో ప్రాథమిక రంగంలో ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం క్రింద రబీలో కూడా సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో సుమారు 2 లక్షల ఎకరాలు సాగవుతుండగా,




రబీలో కేవలం 60వేల ఎకరాలు మాత్రమే సాగు అవుతోందని చెప్పారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు అవసరమైన వనరులను కల్పించడంతోపాటు, బ్యాంకులనుంచి పంట రుణాలను మంజూరు రైతులకు తోడ్పాటు నందించాలని కోరారు. రబీలో సాగు విస్తీర్ణం ఏటా కనీసం 15 శాతం పెంచి రైతుకు లబ్ది చేకూర్చడమే తమ లక్ష్యమని చెప్పారు. సంక్షేమ శాఖల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలకు శతశాతం రుణాలివ్వాలని కలెక్టర్ కోరారు. ఈ నెల చివరినాటికి ఆయా శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకం క్రింద విరివిగా రుణాలను ఇవ్వాలని చెప్పారు. స్టాడప్ ఇండియా కార్యక్రమం క్రింద మంజూరు చేస్తున్నసబ్సిడీ లేని రుణాలపట్ల లబ్దిదారులను చైతన్యపరిచి, వాటిని సద్వినియోగం చేసుకొనేవిధంగా చూడాలని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి లబ్దిదారుల ఎంపికకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కోరారు. సమావేశానికి గైర్హాజరైన పరిశ్రమలశాఖ, కెవిఐసి అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, వారిపై చర్యలను తీసు కోవాలని ఆదేశించారు. నాబార్డ్ సహకారంతో బాడంగి మండలం రైతుల జట్టు పిపిసికి, డిసిసిబి, ఆప్కాబ్ నుంచి బెల్లంపొడి తయారీ యూనిట్ స్థాపనకు మంజూరు చేసిన రూ.కోటి,40లక్షల రుణానికి సంబంధించిన చెక్కును ఈ సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఓ బివి సత్యనారాయణ, మెప్మా పిడి సత్తిరాజు, జెడిఏ విటి రామారావు, ఎపిఎంఐపి పిడి లక్ష్మీనారాయణ, ఎల్‌డిఎం మూర్తి, నాబార్డ్ డిడిఎం నాగార్జున, ఇతర శాఖల అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లు ను వేగవంతం చేయాలి



విజయనగరం : పన్ను వసూళ్ళను వేగవంతం చేయాలని రెవెన్యూ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ మల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయం నందు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇప్పటివరకు వసూలు చేసిన లక్ష్యాలను సమీక్షించారు. ఆస్తి, కులాయి ఖాళీ స్థలముల పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

### నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



విజయనగరం పట్టణ ప్రాంతం తో పాటు శివారు ప్రాంతాలు కూడా పారిశుధ్యపరంగా చక్కటి వాతావరణం నెలకొనాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కేఎల్ పురం ప్రాంతంలోని కాలనీల పరిసరాలలో పర్యటించారు. అక్కడ స్థానికంగా నెలకొన్న పారిశుధ్య పనితీరును గమనించారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోతట్టు ప్రాంతం బురదమయంగా ఉండడాన్ని గమనించారు. తక్షణమే ఆ ప్రాంతమంతా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సిబ్బందికి ఆదేశించారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది తగు చర్యలు చేపట్టి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులను, వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలు కూడా పరిశుభ్రత వాతావరణం నెలకొనే విధంగా చూడాలని సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. శివారు కాలనీవాసులు సరైన రహదారులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారని ఆయా ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు చొరవ చూపుతామన్నారు. వీధి దీపాల సమస్య లేకుండా తీర్చిదిద్దుతున్నామన్నారు.

## 9న జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశం

విజయనగరం: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశాలను జనవరి 9వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సి.ఇ.ఓ. బి.వి.సత్యనారాయణ తెలిపారు.

## అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరాలి

**విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అంబేద్కర్ పిలుపు**

**ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం**



విజయనగరంప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, అందుబాటులో ఉన్న అవకాశాలను సోపానాలుగా చేసుకొని ఉన్నత స్థానానికి చేరాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. విజయనగరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అన్నం, సాంబార్, స్వీట్ పొంగల్, బంగాళాదుంప కూరను భోజనంలో విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 4,660 మంది విద్యార్థులకు ఈ పథకం వల్ల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ పథకాన్ని విద్యార్థులంతా పూర్తిగా వినియోగించుకొని





చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా, చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి నడవడికను అలవర్చుకోవాలని కోరారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అరికట్టడానికి జిల్లా యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోందని, వీటికి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కళాశాలలో విద్యాప్రమాణాలు, ఉత్తీర్ణతా శాతం పెరగాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా అధ్యాపకులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్వి, ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ, డిఈఓ యు.మాణిక్యం నాయుడు, ఎడి గోపీకృష్ణ, ఎంఈఓలు పివిపిఆర్సిహెచ్ రాజు, కె.సత్యవతి, కళాశాల ప్రిన్సిపాల్ వికెవి కృష్ణారావు, కూటమి పార్టీల నాయకులు ఐవిపి రాజు, పిల్లా విజయకుమార్, శివప్రసాద్‌రెడ్డి, పి.ప్రసాద్, కంది చంద్రశేఖర్, ఇ.సుధీర్, అనురాధ, మజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు. కొంతమంది కూటమి నాయకులు, విద్యార్థులు మాట్లాడుతూ ఈ భోజన పథకాన్ని కొనియాడారు.

## అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

**జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్**



విజయనగరం, **జనవరి** : బ్రెయిలీ లిపిని కనుగొనడం ద్వారా అంధుల జీవితాల్లో లూయిస్ బ్రెయిలీ వెలుగులు నింపారని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్అం.బేద్కర్ కొనియాడారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఆర్డిఏ సమావేశ మందిరంలో శనివారం జరిగిన లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లిపిని కొనుక్కొని అంధులకు బ్రెయిలీ మహోపకారం చేశారని అన్నారు. అంధులు కూడా చదువుకొని ఉన్నత స్థానాలను సాధించేందుకు ఈ లిపి ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. ఈ లిపి ద్వారానే చాలామంది ఉన్నత ఉద్యోగులుగా, అధ్యాపకులుగా, సివిల్ సర్వీసెస్ ఉద్యోగులుగా కూడా ఎంపికయ్యారని చెప్పారు. చదువు ద్వారానే ఎదుగుదల సాధ్యమవుతుందని ఉన్నత స్థానానికి చేరుకోవచ్చుననీ ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో అందులకు కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తామని, వారి అవసరాలను తీరుస్తామని హామీ ఇచ్చారు.





బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అంధులకు ఉపయోగపడే విధంగా, వారి అవసరాన్ని బట్టి ప్రత్యేక కంప్యూటర్ శిక్షణా కార్యక్రమానికి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్రెయిలీ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఇన్చార్జి ఏడి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి. బాలాజీ, డిఆర్డిఏ పిడి ఏ. కళ్యాణ చక్రవర్తి, ఎస్సి కార్పొరేషన్ ఈడీ సుధారాణి, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్ధననాయుడు, ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర రెడ్డి, బదిరుల పాఠశాల ప్రిన్సిపాల్ రాంబాబు, అంధ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఉమాశంకర్, ఇతర నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. అంధ బాలబాలికలు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. వేమన పద్యాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసి మెప్పించారు. ముందుగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## హైబ్రిడ్ విధానములో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ




పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యములో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఏ.పీ.ఇ.పి.డి.సి.ఎల్. సూపరింటెండింగ్ ఇంజినీర్ కోడా చలపతి రావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 7, 8 మరియు10 తేదీల్లో మూడు రోజుల పాటు పార్వతీపురం, పాలకొండ డివిజన్ కార్యాలయాలలో హైబ్రిడ్ విధానములో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన చెప్పారు. జనవరి 7, 8 తేదిలలో విజయవాడ బృందావన్ కాలనీ 'ఏ' కన్వెన్షన్ సెంటర్ నుండి జనవరి 10వ తేదిన కర్నూలు కమిషన్ ఆఫీస్ నుండి ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా మరియు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్ కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు వినడం జరుగుతుందన్నారు. ఈ ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులు పాల్గొనవచ్చునని, ఈ మేరకు రిజిస్ట్రేషన్ కు స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయములో (ఎస్.ఈ. ఆఫీస్) లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో (ఈ.ఈ. ఆఫీస్) సంప్రదించాలని ఆయన కోరారు. ప్రతి రోజు ముందుగా నమోదు చేసుకున్న వినియోగదారుల అభ్యంతరాలు విన్న తరువాత విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నమోదు చేసుకొని వినియోగదారుల అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని ఆయన వివరించారు.

## అధైర్య పడవద్దు.. ఆదుకుంటాం

**గుండ మోహనరావుకు సీఎం రిలీఫ్ చెక్కు అందజేత**

**చెక్ ను అందజేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



శ్రీకాకుళం,: ధైర్య పడవద్దు అన్ని విధాలుగా అండగా ఉంటామని బాధితులకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భరోసానిచ్చారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న కేంద్ర మంత్రి నివాసంలో శనివారం గుండ మోహన్ కు 3.30 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు గొప్ప మానవత్వం కలిగిన వ్యక్తి అని పేద రోగుల చికిత్సకు అన్ని విధాలుగా సహకరిస్తుండడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ , స్థానిక ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్ని తీర్చిదిద్దుతున్నాం

**విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ విద్యే కీలకం**

**రాష్ట్రానికి విద్యార్థులే ఒక ఆస్తి**

**ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం**

**ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**గజపతినగరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి**



విజయనగరం,: విద్యార్థులే రాష్ట్రానికి ఒక ఆస్తి అని వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇంటర్ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచే లక్ష్యంతో ఇంటర్ పాఠ్యాంశాల్లో మార్పులు వంటి చర్యలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాంది పలుకుతున్నారని రాష్ట్ర చిన్న పరిశ్రమలు, సెర్ప్,



ఎన్.ఆర్.ఐ. వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్ని తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు భోజనాన్ని వడ్డించడంతో పాటు వారితో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే వారి భవిష్యత్తు నిర్ణయమ వుతుందని పేర్కొన్నారు. అందువల్ల విద్యార్థులంతా తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఉన్నత స్థాయికి ఎదిగే ప్రయత్నం చేయాలన్నారు. తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోసం కాకుండా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం చదవాలన్నారు. గజపతి నగరం జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రమానాలు మరింతగా మెరుగుపడాల్సి వుందని మంత్రి అధ్యాపకులకు స్పష్టం చేసారు. బోధనలో కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని, బోధనలో వున్నలోపాలను సరిదిద్దుకొని ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్ధి వారీగా సామర్థ్యాన్ని అంచనా వేసి ప్రతి విద్యార్ధి మంచి మార్కులతో ఉన్నత ప్రమాణాలతో ఉత్తీర్ణులు అయ్యేలా కృషి చేయాలన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన నిధులను సమీకరించి కంప్యూటర్ ల్యాబ్, ఇతర వసతులను కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను కళాశాల అధ్యాపకులు సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశంపై మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మాజీ మంత్రి పడాల అరుణ కుడా మంత్రి కొండపల్లి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.ఇతర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎంతో ఉపయోగకరమని పలువురు విద్యార్థినులు యీ సందర్భంగా చెప్పారు. స్థానిక నాయకులు గోపాల రాజు, మక్కువ శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎల్.ఎన్.ప్రకాశ రావు పట్నాయక్, కళాశాల అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనంలో తొలి రోజు మెనూ కింద అన్నం, సాంబార్, వంకాయ బంగాళాదుంప కూర, చక్ర పొంగలి తదితర పదార్థాలను విద్యార్థులకు వండి పెట్టారు. అంతకు ముందు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కళాశాల స్థితిగతులపై అధ్యాపకులు, స్థానికులతో చర్చించారు. కళాశాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారితో చర్చించారు.

## చోరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం

**- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్**

**వీదుల్లో సంచరించే అనుమానస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్న జిల్లా ఎస్పీ**

**చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి, చోరీకి గురైనా 18 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న విజయనగరం 1వ పట్టణ పోలీసులు**

**దొంగతనం కేసును చేధించుటలో క్రియాశీలకంగా పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రధానం చేసిన జిల్లా ఎస్పీ**



విజయనగరం : విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని కాళిఘాట్ కాలనీలో ఒక ఇంటిలో దొంగతనంకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 18 తులాల బంగారు వస్తువులను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు, నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జనవరి 4న వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - వీదుల్లో బెలూన్లు అమ్ముతూ, అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తే. 24-12-2024 దిన ఉదయం 11 గంటల సమయంలో కాళిఘాట్ కాలనీలో నివాసం ఉంటున్న కొట్టక్కి జగన్మోహనరావు టైలరింగు షాపుకు వెళ్ళగా, అతని భార్య కూడా ఇంటికి తాళం వేయకుండా గాజులు కొనుగోలు చేసేందుకుగాను దగ్గరలోని గాజులషాపుకు వెళ్ళగా, గుర్తు తెలియని ఒక మహిళ వీధిలో బెలూన్లను




విక్రయిస్తూ, తలుపు వేయకుండా ఉన్న ఫిర్యాది ఇంటిలోనికి ప్రవేశించి, ఇంటిలోగల 18 తులాల బంగారు వస్తువులను దొంగిలించుకొని పోయినట్లుగా, సదరు వస్తువులు రూ. 3.60 లక్షల విలువ ఉంటుందని విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా, 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో ఫిర్యాది ఇంటికి సమీపంలోని మాంసం దుకాణం వద్ద ఉన్న ఒక మహిళ ఫిర్యాది ఇంటి నుండి బయటకు వస్తున్న గుర్తు తెలియని మహిళను, ఇద్దరు పిల్లలను చూచి, ప్రశ్నించినట్లు, అందుకు బదులుగా ఆమె వర్షం కారణంగా కాసేపు అక్కడ తలదాచుకున్నట్లుగా తెలిపి, పరారయ్యారని తెలిపిన ఆధారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి, నేరంకు పాల్పడిన వ్యక్తులను ఝుర్కండ్ కు చెందిన వారుగా గుర్తించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం 1వ పట్టణ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో దొంగతనంకు పాల్పడిన (ఎ-1) ఝూర్కండ్ రాష్ట్రం టాటానగర్కు చెందిన నేహ సబర్ అలియాస్ నేహ జానీ అలియాస్ నేహ సోబర్ (21 సం.లు)ను మరియు ఆమె భర్త (ఎ-2) సరోజ్ జానీ అలియాస్ సరోజ్ సోబర్ (26 సం.లు) లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి చోరీకి పాల్పడిన 18 తులాల బంగారు ఆభరణాలను 1వ పట్టణ పోలీసులు రికవరీ చేసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయుటలోను, చోరీ సొత్తును రికవరీ చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు వి.ఎల్. ప్రసన్న కుమార%ఢ%, కానిస్టేబుళ్ళు ఎన్.గౌరీ శంకర్, టి.శ్రీనివాస్, కే.సన్యాసి నాయుడు, మహిళా కానిస్టేబుళ్ళు కే. మంగమ్మ, షేక్ మీరాబి లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి,



ప్రశంసా పత్రాలను ప్రదానం చేసారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సిఐలు ఎస్.శ్రీనివాస్, ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వచ్చే ఏడాదికి బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు




పార్వతీపురం :పట్టణంలో వచ్చే ఏడాది విద్యాసంవత్సరం నాటికి బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికపరమైన ఇబ్బందులు, పౌష్టికాహార లోపం కారణంగా ఉన్నత చదువులకు దూరం కాకుండా డ్రాపౌట్స్ ను తగ్గించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి ఆహార అలవాట్లు కూడా అలవడి పౌష్టికాహార లోపం తలెత్తదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యంతో అందరికీ ఉన్నత చదువుల అవకాశాన్ని కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని



పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్షా 48 వేలమంది విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం పథకాన్ని అందించనున్నామని, ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఉన్న 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5800 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నామన్నారు. విద్యార్థుల ఆహారాలవాట్ల ప్రకారం జోనువారీగా మధ్యాహ్నం భోజన పథకం అందించనున్నామన్నారు. కేజీ నుండి పీజీ వరకు నాణ్యమైన విద్య, అవసరమైన రక్షణ కల్పించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అలాగే విద్యార్థులు ఎన్ఐటి, ఐఐటి, ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు సాధించేలా ఐఐటి నుండి మంచి నిష్ణాతులైన లెక్చరర్లను రప్పించి పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సబ్జెక్టులలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం కింద ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసించి తను రాష్ట్ర మంత్రి స్థాయికి చేరుకున్నామని, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ హోదాలో పనిచేస్తున్న వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఇంతటి స్థాయికి వచ్చారని గుర్తుచేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న కార్యదీక్షతో విజయాలను సొంతం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు గంజాయి వంటి చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ఇష్టంగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పునరుద్ఘాటించారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ వంటిమహానీయుల పేరున మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం అందరికి గర్వకారణం అన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా బలవర్ధక పౌష్టికాహారాన్ని అందించడం వలన పూర్తిస్థాయిలో చదువుపై దృష్టిసారించవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు తీసుకువచ్చిందని విద్యార్థుల ఇష్టం మేరకు ఆయా మెనూ లను అమలు చేయనున్నామని తెలిపారు. పదవ తరగతిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిన విధంగా ఇంటర్మీడియట్ లోనూ జిల్లా మొదటి స్థానంలో నిలవాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అలాగే విద్యార్థులు మధ్య నేలపై కూర్చుని సహపంక్తి భోజనాన్ని చేసారు. అంతకుముందు పలువురు విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్ప్రభావాలను, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు, సానిటరీ ప్యాడ్స్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వృత్తి విద్య అధికారి వి. మంజులా వీణా, కళాశాల ప్రిన్సిపల్ బి. మురళీధర్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓజీ అని అరిచినా, డిప్యూటీ సీఎం అన్నా.. దానికి ఆధ్యం చిరంజీవిగారే

"ఎదుటి హీరో సినిమా పోవాలని మా జీవితంలో ఎప్పుడూ అనుకోలేదు. సర్వేజనా సుఖినోభవంతు అని మా తండ్రి గారు మాకు నేర్పించారు. అందరూ బాగుండాలనే మేం కోరుకుంటాం" అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సందర్భంగా రాజమండ్రిలో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు పలువు మంత్రులు పాల్గొన్నారు.సినిమా టికెట్లు

మెగాస్టార్ వారసుడు గ్లోబల్ స్టారే అవుతాడు..

"గేమ్ ఛేంజర్ ట్రైలర్ చూశా. నాకు చాలా నచ్చింది. సామాజిక సందేశం ఇచ్చేలా ఉందనిపిస్తోంది. కొత్త సంవత్సరంలో బాక్సాఫీస్ బద్దలైపోవాలి. మగధీరుడు, అల్లూరి సీతారామరాజుగా జీవించేశాడు. మెగాస్టార్ వారసుడు అంటూ అంతే.. మెగాస్టార్ కొడుకు గ్లోబల్‌స్టారే అవుతాడు. చరణ్ అందరి హీరోలకు చాలా మంచి ఫ్రెండ్.. ఏడాదికి వంద రోజుల అయ్యప్ప మాల, ఆంజనేయ స్వామి మాల అని అంటాడు. అహంకారం రాకుండా ఉండాలని చేస్తుంటాని చెబుతుంటాడు. ఆస్కార్ వరకు వెళ్లినా ఒదిగే ఉంటాడు. ఉంటే సూట్‌లో కనిపిస్తాడు.. లేదంటే అయ్యప్ప మాలలో చెప్పులు లేకుండా కనిపిస్తాడు.. రామ్ చరణ్ మా బంగారం.. నా తమ్ముడు లాంటి వాడు.. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండేవాడు.. అద్భుత విజయాలు అందుకోవాలని బాబాయ్‌గానే కాకుండ అన్నగా ఆశీర్వదిస్తున్నాను' అని అన్నారు.

మూలాలు మరచిపోలేదు..

మన సినిమా పరిశ్రమకు మూలాలైనా రఘుపతి వెంకయ్య నాయుడు, దాదా 'సాహెబ్ ఫాల్కే, రాజ్ కపూర్, సత్య జిత్ రేని మర్చిపోలేం, తెలుగు ఖ్యాతిని ఎగరేసిన నాగిరెడ్డి, బీఎన్ రెడ్డి రామబ్రహ్మం, తెలుగు జాతి కీర్తి పెంచిన ఎన్టీ రామారావు గారిని, ఏఎన్నార్ గారిని తలచుకుంటాం. వేదికపై పవన్ కళ్యాణ్ ఉన్నా.. రామ్ చరణ్ ఉన్నా.. దానికి కారణం చిరంజీవి గారు. మీరు కళ్యాణ్ బాబు అని అరిచినా, ఓజీ అని అరిచినా, డిప్యూటీ సీఎం అని అరచినా దానికి చిరంజీవి గారే ఆద్యులు. మేం మూలాలు మరిచిపోము. సీఎం చంద్రబాబు గారి సహకారం, మద్దతు వల్లే ఈ రోజు ఇక్కడ ఇలాంటి ఈవెంట్‌ను నిర్వహించుకోగలుగుతున్నాం" సినిమా టికెట్లు

జనసేనకు ఇంధనంగా పని చేసింది..నేను చాలా తక్కువ సినిమాలకు థియేటర్లకు వెళ్లేవాణ్ణి. శంకర్ గారు తీసిన జెంటిల్‌మెన్ సినిమాను బ్లాక్ టికెట్ కొని చూశా.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com